# దైవ సాయుజ్యము

స్వామి ఓంకార్


ద మిషన్ ఆఫ్ పీస్

**శ్రీ శాంతి ఆశ్రమము**

**తోటపల్లి కొండలు, వయా శంఖవరం–533 446**

తూ॥గో॥జిల్లా, ఆంధ్రప్రదేశ్

ఫోన్ : 7382009962

email: srisanthiashram@gmail.com

website : srisantiashram.org.in

## విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | శ్రీ తమ్ము అస్తమయము | 3 |
| 2. | పూజ్యశ్రీ మలయాళ స్వామీజీ పిలుపు | 7 |
| 3. | శ్రీ పళ్లం రాజుగారి అస్తమయమునకై సంతాపము | 10 |
| 4. | విషాద స్మృతి కీ.శే. అమృతకౌరు | 11 |
| 5. | ప్రియతమ నెహ్రూపండితునికి జోహార్లు | 12 |
| 6. | కీ.శే. శ్రీద్వారం వెంకటస్వామినాయుడుగారు | 19 |
| 7. | అమరజీవి శ్రీ నారాయణరావు | 22 |
| 8. | స్వామి రామానందతీర్థజీకి శ్రద్ధాంజలి | 23 |
| 9. | మా రామం | 25 |
| 10. | మాతృశ్రీ శేషమ్మగారు – జ్ఞానేశ్వరీ మాతాజీ | 30 |
| 11. | శ్రద్ధాంజలి–ప్రియమైన శ్రీ పరమహంస యోగానంద (యు.ఎస్.ఎ.) గారి స్మృత్యర్థం | 31 |




## శ్రీ తమ్ము అస్తమయము

అనువాదం : శ్రీ స్వామి నిర్వాణానంద

శ్రీ తమ్ము పిఠాపురం కుమార రాజావారు. ఆయన నాఒక్కనికే తమ్ము (తమ్ముడు) కాదు; లోకమందరికిని గూడ సోదరుడే. వారి చిన్నతనమునుండి వారిని నేనెరుగుదును. నేను అమెరికాలో నున్నప్పుడు తమ తల్లిదండ్రులతోడను, యువ రాజావారు శ్రీరామారావు బహదూర్‌వారి తోడను వారక్కడకు వచ్చిరి. సర్వదా వారు నా హృదయమునకు సన్నిహితులు, లోకమందరికంటెను నేననిన వారికత్యంత ప్రేమాదరములు, వారు మద్రాసులోని తమ భవనమునకు “ఓంకార్” అని పేరు పెట్టుకొనినారు. తమ వ్రేలి యుంగరములో ఓంకారఛాయా చిత్రము చిన్నది ధరించు కొనినారు. పూజామందిరములో వారి పీఠమున ఓంకార పటముంచుకొనిరి. అపార శ్రద్ధాభక్తులతో వారు ఓంకారమును ప్రతిష్ఠించుకొనిరి.

ఆయన రాజకుటుంబములో జన్మించిన యువరాజై యుండినను కూడ దేహారోగ్య బలశౌర్యములతో గూడిన సద్గుణపుంజమై నిరాడంబరముగ అలరారు చుండెను. ఈ మధ్యనే వారస్వస్థగా నున్నారని వింటిని. వారి సహధర్మచారిణి శ్రీమతి పద్మావతీదేవిగారు వారి ఆరోగ్యము కొరకు ప్రార్థనలు కావించమని ఒక తంతి పంపినారు. దైవకృపవలన వారు నెమ్మదిగా ఆరోగ్యము పొందుచున్నారని మరియొక తంతికూడ వచ్చినది.

ఈ ఉదయమే మరల రెండు టెలిగ్రాములు వచ్చినవి. ఒకటి మద్రాసునుండి, రెండవది బొబ్బిలినుండి. శ్రీతమ్ము అస్తమించినారను విషాదవార్త వానిలోనున్నది. నమ్మలేకపోతిమి.

ఇప్పుడు తమ్ము మునపటికంటె చాలచేరువగా నా ప్రక్కనే ఉన్నట్లనిపించినది. వినమ్రముగా భక్తి భావముతో ఆయన ముకుళిత హస్తములతో నా చెంతనే నిలు చున్నారు. మధుర పరిమళాలు వెదజల్లు పూల ఒడిలోనుండి సర్వదా నేను తమ సన్నిధినే ఉన్నాను అని తల ఊపుచున్నట్లయినది. శ్రీ తమ్ము సజీవులే. ఆయన ఆత్మ తేజము మనలో నున్నది. ఆయన చిరంజీవి. నిర్వాణమందిరమున కెదురుగా నున్న గాంధీజీ, బుద్ధ, క్రీస్తు, కృష్ణపరమాత్మల విగ్రహములీ దివ్య సందేశములతో నన్నోదార్చినవి.

గాంధీజీ : అనేక సంక్షేమ సంస్థల ద్వారా అనాథులను,రోగులను ఆదరించుచు తమ్ము ఇచ్చటనే ఉన్నారు.

బుద్ధభగవానుడు : తమ్ము అహంకారమును అణచివేసినారు, అదిగో, వారు నిర్వాణమును అనుభవించుచున్నారు.

శ్రీక్రీస్తు : తమ్ము పసిపాపల వంటి అకృతిమమైన మనస్సు కలవారు.స్వర్గ రాజ్యము పిల్లలదేకద! ఆయన యిప్పుడు నావద్దకు వచ్చినారు.

శ్రీకృష్ణపరమాత్మ : తమ్ము నాలో ఉన్నారు. నేను వారిలో నున్నాను. ఆయన అమరులు. నేనెన్నడును నా భక్తుని విడువను.

శ్రీ తమ్ము నాకు ఆంజనేయునివంటివారు, అనేక విధముల శాంతి ఉద్యమ ములో నాకెంతయో సహకరించిరి. హనుమంతుడు చిరంజీవి యని శాస్త్రములు చెప్పుచున్నవి. మృత్యువు లేక శాశ్వతముగా నుండు వారిని చిరంజీవులందుము. హనుమంతునివలెనే శ్రీ తమ్ము కూడా చిరంజీవులని భావించుచుంటిని.

లోకములో రెండురకముల మనుష్యులున్నారు. ఒకతెగ మృతజీవనులు. రెండవతెగ జీవన్మృతులు.

మృతజీవనులనగా బ్రతికియుండియు గూడ మరణించినవారు. ఆంతర్య జ్యోతియైన దైవమును మరచుటచే వారు జీవించియు మరణించినవారే, స్వార్థము నకు, భూభారమునకే వీరిమనుగడ.

జీవన్మృతులుమరణించియు బ్రతికియున్నవారు. ఇట్టివారు తమ నిస్వార్థ సేవవలన మానవతకు తలమానికమై వెలుగొందుదురు. వీరు ఇందువలన చని పోయియు జీవించినవారు.

శ్రీ తమ్ము మరణించినారన్న వార్త నేనింకను నమ్మజాలను, ఆ తలంపే నాకు చింతను గలిగించును. శ్రీతమ్ము సజీవులై ఆశ్రమములో నా చెంతనే ఉన్నారను భావన నాకు సంతోషమును, బలమును కలిగించును. ఉపశమనముగా ఉండును. సోదరి సుశీలాదేవిగారి ఆత్మ ఆశ్రమ కార్య కలాపములలో నిమగ్నమై ఇప్పుడు మన చెంతలేదా! అట్లే ఆశ్రమాభివృద్ధి కావించుచు మన తమ్ము మనచెంతనే ఉన్నారు. సోదరి సుశీలాదేవి యనిన తమ్ముకెంతయో గౌరవము. కావున వారిరువురు కలసి యిప్పుడు లోకకళ్యాణము కొరకు శాంతి ఉద్యమమునకు తోడ్పడుచున్నట్లు భావించెదను.

మునుపటివలెనే తమ్ము ఇప్పుడుగూడ సజీవులే. వారియందు నిజమైన యభిమానముకలవారు ఇప్పుడు గూడ ఆయనను ప్రేమించవచ్చు. అనాధులలో, అస్వస్థులలో, దరిద్ర నారాయణులలో ఆయనను గాంచవచ్చును. తమ్ము ఇప్పుడు



వారందరి హృదయములలోను ప్రవేశించి వెలుగొందుచు మన సహాయ సానుభూతులు కోరుచున్నారు. తమ్ముకు శాంతి ప్రార్థన అనిన ఎంతయో ప్రీతి, అది వారి హృదయమున కత్యంత ఆప్తము. శాంతి ప్రార్థనము విగతజీవులను సజీవులతో అనుసంధించును. దానిని ఉచ్చరించునంతనే మనకు దైవ సాన్నిధ్యము అనుభూతమగును. శ్రీతమ్ము దయార్ద్రమైన ఆత్మకు శాంతిచేకూరునుగాక యని పరమాత్మను ప్రార్థించుచు వీలైనన్నిమార్లు శాంతి ప్రార్థనము జపింతుముగాక!

శ్రీతమ్ము తమకుమార్తె చి॥ చిన్నమాంబాదేవి గారి వివాహ సందర్భములో మనశాంతి ప్రార్థనము చక్కని 'బుక్‌మార్క్'గా అచ్చువేయించి మద్రాసు పౌరులకు, రాజబంధువులకు, జమీందార్లకు, రాజులకు, మహారాజులకు పంచిపెట్టినారు. ఎంత చక్కనియూహ వీరిది. శాంతి ప్రార్థనను చక్కని 'బుక్కుమార్కు'గా ఉత్తేజము కల్గించునటుల, సహాయకారిగా నుండునటుల అచ్చొత్తించినారు. అదివెలలేని కానుక. అనుక్షణము మార్పులతోగూడి యున్న ఈ జగత్తులో మాయా విలాసమెంత వింతయైనది. అదేమిటోగాని, మనను ప్రేమించువారు యీ లోకములో నున్నంత సేపు వారి ప్రేమాదరములను సరిగా అర్థము జేసికొనలేము. వారు భౌతిక దేహము చాలించినతోడనే వారి అమితానురాగము, వారులేని వెలితి కనుపించును. దీప మారిపోయిన తర్వాత గుర్తించి మాత్రమేమి ప్రయోజనము.

సర్వదా శ్రీతమ్ము హృదయములో శాంతి ఆశ్రమము యొక్క భవితవ్యమే ప్రథమస్థాన మాక్రమించెడిది. ఆయన మూడు సంవత్సరములు మన ఆశ్రమమునకు అధ్యక్షులుగా నున్నారు. మద్రాసుమీదుగా మేము వెళ్ళునప్పుడు మాకు చక్కని ఆతిథ్య మిచ్చెడివారు. తమ బంధు మిత్రులను పిలిచి తమ యింటివద్ద శాంతి సభలు జరిపించెడివారు. శివగంగ రాజావారిని, రాణీసాహెబావారిని పరిచయము చేసినది వారే. పుదుక్కోట మహారాజుగారిని శాంతి యాశ్రమమునకు యావజ్జీవన సభ్యులుగా చేసినదివారే. మద్రాసు మీదుగా ప్రాశ్చాత్య దేశాలకు వెళ్ళునప్పుడు తిరువాన్కూరు మహారాజావారి వద్దకు మమ్ము తీసుకుని వెళ్ళుటకు కృషి సల్పిరి.

శ్రీ తమ్ము ఆశ్రమమున కెంతయో సేవయొనర్చిరి. ఇంకను హెచ్చు సేవ చేయ సంకల్పించినారు. నేను మౌనముగానున్న రోజులలో కొండమీద నున్నకైలాస ఆశ్రమములో కొంతతడవు గడిపిరి. ఆశ్రమ బాల బాలికలను తమ స్వంత బిడ్డలవలె ఆదరించిరి. వారికి ఐస్‌క్రీం, బిస్కత్తులు, మిఠాయిలు యిచ్చెడివారు. చి. జ్ఞానేశ్వరి యనిన వారికెంతయో అభిమానము. ఆమెను తమ కన్నబిడ్డవలె జూసుకొను చుండెడి వారు. ఆయన దృఢిష్టులు, నోరులేని జంతువులనిన అమితమైన అభిమానము. పిల్లలను చాలముద్దుగా చూచెడివారు.

ఆఖరుకు ఆయన ఉత్తరములు వ్రాసుకొను "లెటర్‌హెడ్స్" మీద కవర్ల మీద 'ఓం' అని సంస్కృతములోను, భగవంతుడే ప్రేమ అని ఇంగ్లీషులోను అచ్చు వేయించి నారు. వారికి సంగీతమనిన, నోరులేని జంతువులనినను ప్రీతి. అందువలన వీణా పాణియైన సరస్వతిని, గోమాతను,పద్మమును వారు తమ లెటర్ హెడ్స్ మీద అచ్చు వేసినవే వాడుచుండెడివారు. తమ్ము సర్వదా నా యోగక్షేమములను గూర్చి ఆలోచించెడివారు. వారు చి.జ్ఞానేశ్వరితోను చి. శాంతితోను తదితర సభ్యులతోను చెప్పిన విషయము ఎంత ప్రేమాదరములతో నున్నదో చూడుడు.

"నేను దూరముగా మద్రాసులో నుండుటచేత స్వామీజీ సేవ దగ్గర ఉండి స్వయముగా జేయు భాగ్యము నాకు కలుగలేదు. మీరదృష్టవంతులు. స్వామీజీ సన్నిధినే ఉన్నారు కనుక నా తరపున కూడ నిరంతరము వారికి శక్తివంచన లేక ఉపచారము చేయమని కోరుచున్నాను."

సర్వదా నన్ను వారు "ప్రభూ–స్వామీజీ–మాస్టర్ అని నోరార తీయగా పిలిచెడి వారు. అట్టి శ్రీతమ్ము జ్ఞాపకార్థము 'తమ్ము ప్రార్థనాలయము' అనునది శాంతి ఆశ్ర మములో నెలకొల్పవలెనని నా అంతర్వాణి అనుచున్నది. ఆ ప్రార్థనాలయములో శ్రీ తమ్ము చిత్రపటముంతుము. అక్కడ రోజు భజనలు, ప్రార్థనలు జరుగుచుండును. భక్తులు శ్రీ తమ్ము ఆత్మశాంతినికోరుచు ధ్యానము చేయుచుందురు. శ్రీ తమ్ము జ్ఞాపకార్థము తమ్మును ప్రేమించు వారందరును వారిపేర నిర్మింపబడే యీ పవిత్ర చిహ్నమునకు సహాయ సానుభూతులందింతురని నా నమ్మకము. శాశ్వతముగా ఆశ్రమములో వారి జ్ఞాపకార్థము ఏదోవొక మహత్తర కార్యము కావించి స్థూలముగా వారులేనిలోటును మరచుటకు కోరుచుంటిని.

విషాదముతో పరితపించు శ్రీ తమ్ము స్నేహితులకు, బంధువులకు శ్రేయోభి లాషులందరకు పరమేశ్వరుడు శాంతి సౌఖ్యము నొసంగుగాక! పిఠాపురం రాజా వారి కుటుంబమునకును శ్రీ తమ్ము కుటుంబమునకును యీతీరని లోటువలన కలిగిన అశాంతిపాయుగాక!

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు

(శాంతి జనవరి 1962)



## పూజ్యశ్రీ మలయాళ స్వామీజి పిలుపు

శ్రీ మలయాళ స్వాములవారి చిత్తరువు, చిన్న ఫొటో యొకటి నాబల్లమీద గలదు. దానిని జూచినప్పుడెల్లను శ్రీ స్వామీజీ నన్ను పిలుచుచున్నట్లే యుండును. శ్రీ స్వామీజీ నా హృదయమునకు చాల సన్నిహితులు, వారి హృదయమునకు నేను గూడ సన్నిహితుడనే, నాదగ్గరనుండి వారివద్దకు యెన్ని గజముల దూరమున్న వారి దగ్గర నుండి నాకును, అన్ని గజముల దూరమే యుండునుగదా! మా యిద్దరి మధ్యను యెంత మాత్రము దూరమే లేకుండెడిది. శ్రీ మలయాళ స్వామీజీ, శ్రీ ఓంకార స్వామీజీ రెండుగాదు, ఒక్కటే అని చాలమంది భక్తులనుకొనుచుండెడివారు.

శ్రీ స్వామీజీ భౌతికదేహమును చాలించితిరన్న విషాదవార్త మొన్నను కాకినాడ నుండి భక్తులురాగా వారినుండి ఆశ్రమవాసులువిని చాల విచారించిరి. మరునాడు 12-7-62 తేదీ గురువారము శయనైకాదశి మహాపుణ్య దినమున రాత్రి 12 గంIIలకు శ్రీ వ్యాసాశ్రమములో మహాసమాధినొందిరన్న విచారకరమైన ఉత్తరము గూడ శ్రీ వ్యాసాశ్రమము నుండి వచ్చెను.

శ్రీ స్వామీజీ, నేను రెండుగాదు గావున, వారున్నచోటనే నేను గూడ యుండు టకు కోరుట సహజమే! వారు వెళ్ళిన తావుననే నన్నుగూడ రమ్మనమని నాకు స్వాగతము పంపుచున్నట్లు తోచుచున్నది. శ్రీ స్వామీజీ ముక్తజీవులు, జీవన్ముక్తులు. వారు భౌతిక దేహమును వదలినను నిత్యముక్తులుగా సిద్ధపురుషులుగా జీవించియే యున్నారు.

శ్రీరామకృష్ణ పరమహంస, శ్రీ రమణమహర్షి మొదలైన సిద్ధపురుషులవలె శ్రీ మలయాళ స్వాములవారు గూడ స్థూలరీతిగ శరీరమువదిలే ముందు చాల బాధలు పడియుండిరి. మేము నీలగిరి శాంతి కేంద్రమునకు వెళ్ళునప్పుడు, వచ్చు నప్పుడు తరచు శ్రీ స్వామీజీ దర్శనార్థము శ్రీ వ్యాసాశ్రమమునకు వెళ్ళుచున్నను, మా దురదృష్టముచే శ్రీ స్వామీజీ యెప్పుడును వెల్లూరు ఆస్పత్రిలోనే చికిత్సను బడయుచుండెడివారు. అందుచేతను యీ మధ్యను, వారి దర్శనమే లభించక పోవుట విచారకరము. అయినప్పటికి శ్రీ స్వామీజీ శిష్యులు, శ్రీ పరమేశ్వరానంద స్వాములవారు, శ్రీ గోవింద స్వాములువారు, వ్యాసాశ్రమవాసులందరూ గురుకుల బాలబాలికలతో సహా మమ్ము యెన్నో రీతులుగా గౌరవించుచూ, ప్రేమించుచూ, శ్రీ స్వామీజీ ఆశ్రమంలో లేనికొరతను లేకుండ జేయుచుండెడివారు.

ఇప్పుడు శ్రీ స్వామీజీ ఎక్కడకు వెళ్ళిరి? ఎక్కడకు వెళ్ళగలరు? ముక్తపురుషు లైనవారు సర్వత్రా నిండియుండిరి. వారి ఆత్మ వారిని ప్రేమించెడి వారిలోనే లీనమై

యున్నది. ఈ లోకములో రెండు తరగతుల మానవులు గలరని మహనీయులు జెప్పుచుందురు.

1. బ్రతికియుండియు చనిపోయినవారు. ఎంత ధనవంతులైనను, బలవంతులు, మేధావంతులైనను అట్టివారు దైవమును మరచిన ప్రేమశూన్యులై యున్నను, బ్రతికియున్నను చనిపోయినవారితోనే సమానము.

అట్టివారి జీవితములు భూమికి భారమే, విశ్వప్రేమలేని హృదయము శ్మశానమువంటిది.

2. ఇక పూజ్యశ్రీ స్వామీజీవంటివారు, దేహముతో యున్నను దేహము విడిచినను, వారు నిత్యజీవులే! నిరంతరము ఇప్పుడేగాక యెప్పటికిని, శాశ్వతముగా లోక కళ్యాణమునకు తోడ్పడుచు, జీవించుచునే యుండిరి.

దైవమును మరచినవారు, సాధువులైనను, గృహస్థులైనను మృతజీవులే! బ్రతికియున్నను చనిపోయినవారితోనే సమము. ఇక దైవమును మరువని వారు యెవ్వరైనను, వారు ఏ ఆశ్రమంలో బ్రహ్మచారి గృహస్థ, వానప్రస్థ, సన్యాసాశ్రమంలో యున్నను, జీవన్ముక్తులుగా భక్తకోటికి లోకమంతకూ ఆదర్శనీయమైన మహనీయులుగా జీవించుచుండిరి. శ్రీ మలయాళ స్వాములువారు పూర్వముకంటె ఇప్పుడే హెచ్చు ప్రభతో, శక్తితో, తేజస్సుతో, ప్రేమతో నిండి భక్తుల హృదయములలో ప్రకాశించుచున్నారు, కండ్లున్నవారు శ్రీవారిని నిరంతరము దర్శింపవచ్చును. చెవులున్నవారు శ్రీవారి వాక్కునే అన్నివాక్కులలో వినవచ్చును. శ్రీ స్వామీజీ పుష్పములలో వికసించుచున్నారు. పక్షులలో పాడుచున్నారు. బాల బాలికలలో నవ్వుచు ఆడుకొనుచున్నారు. నదులలో ప్రవహించుచున్నారు. పర్వతములలో స్థిరమైయున్నారు. గాంచుడు! మీ శిరస్సులను పైకెత్తి రాత్రులయందు ఆకాశమువైపు జూచిన ప్రతీ నక్షత్రములోను శ్రీ స్వామీజీయే గానవచ్చెదరు. నక్షత్రములలో, సూర్యచంద్రాదులలో శ్రీ స్వామీజీతేజస్సే నిండియున్నది.

అంతా రామమయం. ఈజగమంతా రామమయం. రాముడు, శ్రీస్వామీజీ రెండుగాదు ఒక్కటే. వారి "యదార్థభారతి" కర్మ, భక్తి, యోగ, జ్ఞానములను దెలిపెడి ఆధ్యాత్మిక విషయిక మాసపత్రిక.

"ఓమిత్యేకాక్షరం బ్రహ్మధ్యేయం సర్వ ముముక్షుభిః" అని

సర్వమత వేదాంతసారమును 36 సంవత్సరముల నుండి ఏకగ్రీవముగా చాటుచు ఆంధ్రదేశములో అనుభవనీయమైన సేవను చేయుచున్నది. అదిగో! నేనిప్పుడీ వ్యాసమును శ్రీస్వామీజీ సన్నిధిని అనుభవించుచూ వ్రాయుచుండ, పిప్పిహ, అనెడి చిన్నపక్షి దూరమునుండి వ్యూకహా! ప్రభువెక్కడ, శ్రీస్వామీజీయెక్కడ? అని వెదకుచు ఆర్తనాదము జేయుచున్నది. శ్రీస్వామీజీ హృదయములకు హృదయముగా



పవిత్రమైన మన ఆంతర్య హృదయముననే జ్యోతిస్వరూపముగా వెలుగుచుండిరని సమాధానము వచ్చుచున్నది. శ్రీ స్వామీజీ ఇప్పుడు, ఈ లోకములో వేరే శరీరములేదు. వారి ప్రియమైన స్వార్థ రహితులైన శిష్యులు. భక్తుల హృదయములలో ప్రవేశించిరి. మన శరీరములే శ్రీ స్వామీజీ శరీరములు. వినుడు! మరల పిప్పిహాపక్షి, స్వామీజీ, ఇచ్చటనే యున్నారు. ఇదివరకు కంటె ఇప్పుడే హెచ్చుగా మనందరిలో జీవించుచున్నారని గానము జేయు చున్నది. శ్రీ స్వామీజీ స్వార్థరహితమైన సేవాపరులు, వారు అనుభవించెడి బ్రహ్మానందమును నిత్యశాంతిని, మనలనుగూడ అనుభవించుటకు పిలుచుచున్నారు. శ్రీవారి పిలుపు మీకు వినబడుటలేదా? ఒక్కతరి నిశ్శబ్దముగానుండుడు. శబ్దములో గూడ వారే!

పరమపావనమైన వారి జీవితమంతయు దేశాభ్యుదయమునకు, లోకశాంతికే ప్రతీక్షణమును ధారపోసియుండిరి. ఒక్కమారు వారు స్థాపించిన వ్యాసాశ్రమమును దర్శించినను, వారు రచించిన ఏ వేదాంత గ్రంథమును చదివినను, శ్రీ స్వామీజీ మహత్తరమైన జీవితము ఇదివరకు, ఇప్పుడేగాక, ఎప్పటికిని మానవకోటికి ఆదర్శనీయముగా నిరంతరము తోడ్పడుచుండునని మనమందరమును గ్రహింపగలము. ఇక వెయ్యి మాటలు, హెచ్చు వ్రాతలేల?

శ్రీ స్వామీజీ మనలను పిలుచుచున్నారు. అశరీరిగా వారిప్పుడనుభవించుచున్న ఆత్మానుభవమును మన అందిరితో పంచుకొనుటకు మనలను ఆహ్వానించుచున్నారు. ఇదియే మంచితరుణము, తరించుటకిదియే గొప్ప సావకాశము, ఇంకను యీ అస్థిపంజరములను, అనిత్యమైన యీ భౌతిక శరీరములను అంటిపెట్టుకొని, ఎంతకాలము, యీ పృథ్వితో బంధింపబడి ఖండమైన జీవితములను, అల్పమైన భావనలతో జీవించుదుము? "పరోపకారార్థ మిదం శరీరం" యీదుర్లభమైన మానవజన్మలు ఇతరుల సేవకొరకే ఇవ్వబడెను. గాన మనముగూడ శ్రీస్వామీజీ వలె ప్రతీక్షణము ఆత్మసోదరీ,సోదర స్వరూపముల సేవలో గడుపుచు మనము తరించి మనతోడివారి తరింపునకు తోడ్పడెదముగాక! అఖండకోటి సచ్చిదానంద స్వరూపముగా వెలుంగుచున్న శ్రీమలయాళ స్వాముల వారి పరిశుద్ధాత్మకు నా జోహార్లు!

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

**శ్రీమత్ పరమహంస పరివ్రాజకాచార్యవర్యులు శ్రీశ్రీశ్రీ మహర్షి శ్రీ సద్గురు శ్రీమలయాళ స్వామీజీ వారి శిష్యకోటికి ఆత్మశాంతిని కోరుచు ప్రేమతో అర్పణ.**

**ఓంమంగలం గురుదేవాయ మహనీయ గుణాత్మనే !**
**సర్వలోక శరణ్యాయ సాధురూపాయ మంగళమ్ ॥**

**ఓం సత్యం ! శాంతం ! దయ**

(శాంతి ఆగస్టు 1962)

## శ్రీ పళ్ళంరాజుగారి అస్తమయమునకై సంతాపము

అనువాదము : శ్రీ స్వామి నిర్వాణానందగారు

శ్రీ పళ్ళంరాజుగారు చిరకాలమునుండియు ఆశ్రమాభిమానులు. శాంతి వ్యాపకమునకు కంకణము కట్టుకున్న శ్రీ శాంతి ఆశ్రమమునకు బహుకాల భక్తులు అయియున్నారు. ఆయనకు గల ఆశ్రమాభిమాన మెట్టిదనగా, ఒకప్పుడు శాంతి ఆశ్రమము యొక్క బాధ్యతనంతను వారిపై వైచుకొని, ప్రపంచమంతయు శాంతి సందేశములతో ముంచెత్తివేయు విధముగా లోకశాంతికి పాటుపడవలెనని పట్టుదల పూని యుండిరి. వారి జీవితము చాల ఉత్కృష్టమైనది. శ్రీ గాంధీజీ పిలుపుతో ముందుకుదుమికి, కాంగ్రెసులోచేరి, తెల్లదొరల పరిపాలనను ప్రతిఘటించి, ఖైదు శిక్షలు అనుభవించి, తుదకు స్వరాజ్యమును సంపాదించిరి. వారు అహర్నిశము, దైవసేవ, భక్తుల సేవాతత్పరులై, దేశభవితవ్యం కొరకే పాటుపడిరి. వారి త్యాగనిరతి కొనియాడదగినది. శ్రీ స్వామీజీకి వారు సన్నిహితులు. శ్రీ వారిపై వారికి అశేషభక్తి ప్రపత్తులు, అకుంఠిత విశ్వాసము కలవు. శ్రీ స్వామీజీ కోటగిరి నుండి ఆశ్రమము నకు బయలుదేరిన తిరుగు ప్రయాణములో కొందరు భక్తుల ఆహ్వానమును పురస్క రించుకొని, హైద్రాబాదు విచ్చేసి, శాంతి బీజములను నాటిన సందర్భములో, శ్రీ పళ్లంరాజుగారు జబ్బుస్థితిలో నుండిరని శ్రీవారు వినగానే, ఒక్కక్షణమైనను జాప్యము చేయక, హుటాహుటిని వారి బసవద్దకు బయలుదేరివెళ్ళిరి. వారు జబ్బుస్థితి నుండి బైటపడి, ఆరోగ్యము కోలుకొనుగోరుచు ప్రత్యేక ప్రార్థనలు, ప్రణవగానము సలిపిరి. అది జరిగి యిప్పటికొక సంవత్సరమాయెను. పిమ్మట కొలది నెలల క్రిందటనే, కొందరు బంధువులతో శ్రీ పళ్ళంరాజుగారు ఆశ్రమమునకు విచ్చేసి, శ్రీ స్వామీజీని దర్శించి, కృతార్థులైరి. దురదృష్టవశముచే శ్రీ పళ్ళంరాజుగారు దివంగతులైరనెడి సంతాపకర వార్త నేడు విననయ్యెను. గొప్పవారికైనను, సామాన్యులకైనను జీవితాంతముతోసరి. మంత్రి పదవిని విజయ ఘంటాపథములో సాగించుచు ఉచ్ఛస్థితిలో నుండి మరణించి కీర్తినిగాంచిరి. శ్రీ స్వామీజీ సాధారణముగా నుడువు చుందునటుల, ఇతరుల యోగక్షేమముకొర్కై కష్టించి పనిచేసి, తమ ఆయువునంతను, పరోపకారమునకు ధారపోసిన వారు మృత జీవులై యున్నారు. వారికి మరణమెన్న టికిని లేదు. స్వార్థపరులై, దైవమును మరచి, తమ శ్రేయస్సు తమకుటుంబ శ్రేయస్సు కొరకు మాత్రమే బ్రతికెడివారు, జీవించియున్నను మరణించినట్లే, శ్రీ పళ్ళంరాజు గారివలె దైవ ప్రతిబింబములై యుండి,మానవసేవను, మాధవసేవగా భావించి సేవ చేసెడి వారు ధన్యులు. శ్రీ పళ్ళంరాజుగారి పవిత్రాత్మ దైవములో నివసించి, శాంతి అనుభవించుటకును, వారి వియోగముచే దుఃఖ సముద్రములోమునిగియున్న



వారి కుటుంబమునకు మా సానుభూతిని అందజేయుచును దైవమును ప్రార్థించుచు, అశేషాంధ్ర ప్రజానీకంతోపాటు, వారి పవిత్రాత్మకు మేము శ్రద్ధాంజలి ఘటిస్తు న్నాము. శ్రీ పళ్ళంరాజుగారి అనుచరులు, బంధువులు, స్నేహితులు, వారిని ఆదర్శ ప్రాయముగా తీసికొని, వారి అడుగుజాడలలో నడిచి మాతృభూమి సేవాతత్పరులై యుండెదరుగాక! యని ప్రార్థించుచున్నాము.

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

(శాంతి డిశంబరు 1962)

## విషాద స్మృతి కీ.శే. అమృతకౌరు

హృద్రోగ బాధితులగు అమూల్య మానవులు ముందుగా దివంగతులగు చున్నారు. నిమ్నోన్నతములతో, ద్వంద్వములతో, పరీక్షలతో, కష్టములతో నిండియున్న ఈ ప్రపంచములో నన్ను వంటరిగా చేయుచున్నారు. మితిమీరుచున్న అన్యాయము, అవినీతి అమాయకులకు, బీదలకు, దుర్బలులకు గలుగుచున్న బాధలు చూచుచున్న ప్పుడు నాకు కూడ అభిమన్యు విహారమునకు సత్వరముగ జేర మనసగుచున్నది. అభిమన్యు విహారములో అంతా అఖండ ప్రకాశమే, విశ్వప్రేమయే.

మాతృభూమి వర్తమాన భవిష్యత్తులు చాల విచారకరముగ నున్నవి. రాజోద్యో గులలో స్వలాభము, అహంకారము, అవినీతి ప్రబలియున్నవి. అన్యాయమునకు జంకక, తమ స్వలాభములకు, తమ మిత్రుల లాభములకే ఎంతయు పాపభీతిలేక ప్రజాపీడనా పరతంత్రులై ఉన్నతోద్యోగులు ప్రవర్తించుచున్నారు.

దేశభక్తురాలైన దేశపిత మహాత్మాగాంధీ అనుయాయియై, వినమ్ర, విశాల విశ్వాస హృదయముతో జీవితము సార్థకతచేసుకొని శ్రీమతి అమృతకౌరు ప్రఖ్యాత భారతనారి ప్రస్తుత పరాధీనతలో, అనారోగ్యతలో, చికిత్సాలయపు పడకమీదనుండి, ఆమె ప్రార్థనల నర్థించి ఆమెకు వ్రాయ సంకల్పముతో నుండగా, ఆమె హఠాత్మరణ వార్త నన్ను ఆశనిపాతమువలె నిశ్చేష్టు నొనరించినది. మాయ హృద్రోగము నామెను పొట్టన పెట్టుకొన్నది.

ఒకప్పుడు నేను కైలాసాశ్రమములో నిశ్శబ్ద మౌనస్థితిలో నుండగా కీ.శే. అమృతకౌరు, డా. టి. కె. రామన్, కీ. శే. కృష్ణన్ లేటు ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపాధ్య క్షులతో నన్ను చూచుటకు విచ్చేసిరి. ఆమె నిర్యాణమువలన విశ్వప్రార్థన ప్రాముఖ్యము

గుర్తించిన భక్తురాలను శాంతి ఆశ్రమము పోగొట్టుకొనెను. తరచు ఆమె భక్తి ప్రేమలతో, వ్రాసిన ఉత్తరములలో నొకదానిలో ఈ క్రింది మాటలుండెను. ఆయుత్తరములలోని మాటలు.

“పూజ్యశ్రీ స్వామీజీ! తమ విశ్వప్రార్థన ప్రతిరోజు పఠించుటచే, నాకు అపార శక్తి, ఆనందము కలుగుచున్నది. నా నిత్య బాధ్యతల నిర్వహణము సుకరమగుచున్నది”

మహాత్మాగాంధీ, శ్రీ రాజేంద్రప్రసాద్, శ్రీ అమృత కౌరువంటి మహానుభావులకు మరణముండదు. స్వార్థులను నిస్వార్థతకు, అజ్ఞానులను జ్ఞానమునకు, అంధకారము నుండి ప్రకాశమునకు మానవాళిని నడిపించుచుందురు. కీ.శే. అమృతకౌర్ భారత మాత దివ్య సంతానములో మాణిక్యమానమై స్వేచ్ఛా స్వాతంత్ర్య మార్గమునకు విశ్వ జ్యోతియై ఆమె ఆరాధించిన ప్రేమ, జాలి, దయ, దైవీభూతములై శాశ్వతముగా భారతభూమిలో స్వప్రతిష్ఠములగుగాక !

ఇది శ్రీ శాంతి ఆశ్రమవాసులర్పించు ప్రేమాంజలి.

(శాంతి మార్చి 1964)

## ప్రియతమ నెహ్రూ పండితునికి జోహార్లు

మానవుడు, “నేను సర్వశక్తిమంతుడను, నా భాగ్య భోగ్యాది కర్మమునకు నేనే యధికారిని” అని యెంతగా భావించునట్టివాడైనను, మానవుని యీ జీవితము, అదృష్టము, అవసానకాలము, మున్నగునవి యన్నియు మానవుని సృష్టికి కారణమైన ఆ పరమేశ్వరుని చేతులలో నున్నట్లే యనిపించుచున్నవి. “మానవుడు నేడున్నాడు! రేపులేడు” అను పలుకులు ఎంత సత్య బంధురములు! రేపేమి జరుగునో, ఉత్తర క్షణములో నేమి సంభవింపగలదో, ఆ పరమేశ్వరుని నుండి యెన్నడు పిలుపు వచ్చునో ఎవ్వడు చెప్పగలడు? మే 27వ తారీకున సాయంకాలము 5 గంటలకు ‘కైలాస’ములో నున్న నాకు, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ హృద్రోగము వలన, ఆకస్మికపు మరణపువాత బడెననువార్త శ్రీ స్వామి రామానంద తీర్థజీ, శ్రీచిత్రాజీ (సి.ఆర్.చిత్రాగారు) దెలిపిరి. నేనును ఆరు మాసములుగా హృద్రోగము చేతనే బాధపడుచున్నాను; భగవంతుడేలనో నన్ను తీసుకొనిపోలేదు సరికదా, అతడు చైతన్యపు భావసాధన మూర్తియు తనకు నచ్చినవాడు నయిన జవహర్‌లాల్‌ను తన హృదయ పీఠమునకు గొంపోయినాడు...(నేనెంత యభాగ్యుడను?) అవును; ప్రతి వ్యక్తికిని ఏదియుక్తమో, యుత్తమమో భగవంతుడొక్కడే యెఱుంగును. మన



గొప్ప గొప్ప వేధలతోను, అనంత విజ్ఞాన పారంగ తత్త్వముతోను, భగవంతుని ముందు ఎంతటి అజ్ఞానులమో!

ప్రాక్ పశ్చిమ దేశములలోనున్న మేధావులు, సర్వజ్ఞులయిన మహాత్ములు, అద్వితీయ ప్రతిభాశాలురయిన దైవజ్ఞ శిఖామణులు వీరిలో నేయొక్కరుగూడ పండిట్ నెహ్రూకు రానున్న మరణమునుగూర్చి గాని అమెరికా సంయుక్తరాష్ట్రముల అధ్యక్షుడైన కెనడీ మహాశయుని ఘోరహత్యను గూర్చిగాని, మున్ముందుగా సూచించలేకపోయిరే! అంతయు ఇంతటి మన తెలివితో, శాస్త్రీయ పరిజ్ఞానముతో, మనస్సంబంధ వివేక శాస్త్రపు నైశిత్యముతో మన మందరము ఏమియు దెలియని పసిపిల్లలము–వట్టి శైశవ ప్రాయములోనివారము మనము ప్రపంచ సముద్రపు టిసుకరేణువులతో, యిదియే మన సర్వస్వమని భావించి, అంతర్వర్తియగు జ్యోతిః పుంజమును విస్మరించి, నాడుకొనుచుండినట్టి వారము.

మహాత్ములయిన మహాత్మాగాంధీ, పండిట్‌నెహ్రూ మున్నగునట్టివారు, సంతతము పరిణామ భ్రమణమునొందు శరీరముల పతనముతో నెన్నటికిని మరణింపజాలరు. వారు పూర్వముకంటె నిప్పుడే యెక్కువగా మనలో నివసించుచున్నారని నేనూహింతును. స్వార్థము కోసమే జీవించునట్టివారు బ్రతికియున్నను చనిపోయినట్టివారే! మఱి స్వార్థత్యాగులు భౌతికముగా మరణించినవారయినను, మనయందెక్కువగా జీవించియున్నవారే! ఏలయన, వారి ఆత్మలు నిత్యములు కనుక. నిత్యమైన ఆత్మకు అసలు మృత్యువెక్కడిది? మే 28 నాటియుదయమున, కైలాసగిరి యందలి యొక మూలనున్న రాతిగుట్టపై సముద్రమున కభిముఖుడనై కూర్చుండియుండి, ఆకాశపుటంచులనుండి యుదయోన్ముఖుడగుచున్న సూర్యభగవానుని గూర్చి యథాపూర్వా ధ్యాన మొనరింప నారంభించితిని. కాని, నా హృదయమున నేను ఏ జాతియందున్నను సరే అథఃపతితులై యాక్రోశించునట్టి జనములు– వారి కొరకై విశ్వజనీనమైన ప్రేమతో, దయతో సముద్ధరింప యత్నించిన ఆ పండిట్ నెహ్రూ మహాశయుని గూర్చి యాలోచించుచుండుటచే, నా హృదయమున నొక భారము తోచినది; విషాదమలముకొన్నది.

తెలియకుండగనే, ఎదురుగా సముద్రమున లేచిపడు తరంగముల తోడను, అప్పుడే పైకి ప్రసరింపబడు సూర్యకిరణములతోను ఇట్లు భావ వినిమయ వ్యాపారము సాగినది.

ప్రశ్న : ఓ నెహ్రూజీ! నీవు కొన్ని గంటలకు పూర్వమే భౌతికమైన శరీరమును విసర్జించితివి. నీవు రూపమునుగదా విడచితివి! ఇప్పుడెందుంటివి? నీఉదారమయిన ఆత్మ యెచ్చట సంచార మొనరించుచున్నది?

సమాధానము : అదిగో కనుగొనుము; నేనీ సముద్రపు తరంగాల రూపములో నుంటిని; సూర్యకిరణ రూపమున నుంటిని. బ్రతికియున్నప్పుడో, నేదో యొకే రూపముగొన్న యుపాధితో పనిచేసితిని; ఇప్పుడు నేను పూర్వము కంటె స్వతంత్రుడ నైతిని–అంతియేకాదు. నేనారూపముల నన్నింటినైతిని. ఇది యది యననేల నన్నింటి నైతిని. నాఆత్మ, నాజన్మ దేశమునందలి నలుబది నాలుగుకోట్ల జనముల హృదయము లలో ప్రవేశించినది. లేదు! లేదు! నా ఆత్మ ప్రపంచమందున్న నలుబదివేల మిలి యన్‌ల సంఖ్యగల యీ సృష్టియందలి జనముల హృదయములలో ప్రవేశించినది. నేను పూర్వము కంటె నిప్పుడు ఎక్కువ స్వేచ్ఛతో నుంటిని ఏలయందురా! మీ యందరిలో నుండి యావన్మావవలోకమునకై పనిచేయవచ్చును – సరికదా, వారికి సేవ చేయవచ్చును.

ప్రీతికరమైన ఈ పలుకులను వినుచు నేనోదార్పునొందితిని; నా హృదయ భారము తొలగి తేలికపడితిని; అంతటి యుదాత్తమయిన నెహ్రూజీ వంటివాని ఆత్మ భౌతిక శరీరమొక్కటి రాలిపోయినంత మాత్రముచే,నిగళబద్ధమై యుండుటగాని తగ్గిపోవుటగాని జరుగరాదు. చదువరులకీ దిగువ విషయము చోద్యముగా నుండ వచ్చునుగాని–27వ తారీఖున సరిగా మధ్యాహ్నం 2 గం॥లకు నెహ్రూజీ మరణ ఘడియలలో కైలాసమున నొకచెట్టుపై ప్రపంచశాంతి నాకాంక్షించుచు నెగుర కట్టబడి యున్న శాంతి పతాకము పెద్ద సుడిగాలికి తనంతట నదియే తద్ధ్వజము వెంట సగము క్రిందకుజారి, ప్రపంచమందలి యితర ధ్వజ పతాకలతోడి విషాదరేఖను దాల్చినదా యన్నట్టులయ్యెను. ఈవిషయమును, నెహ్రూజీ మరణించిననాటి దినమున, నా సమయమునందే, ఆశ్రమ బాలురువచ్చి చెప్పిరి. నిత్యము అమరము అయిన అతని ఆత్మ శాశ్వత శాంతి ననుభవించుగాక !

ఓం ఓం ఓం

నాకు హృద్రోగము బాగావచ్చిన నాళ్లలో, రోగముచే పరుండియే, పండిట్ నెహ్రూజీకి యొక యుత్తరము వ్రాయునట్టి యవకాశము లభించినది. శ్రీపుకార్‌మల్ దధీచి, నావద్దకు శ్రీ నెహ్రూజీపేర 51/– రూపాయలకొక చెక్కు వ్రాసి తీసికొనివచ్చి "స్వామీజీ! ఈధనము పిల్లల క్షేమమునకై వినియోగింపబడవలయును. మీరు నా యీ కోరికను వ్యక్తీకరించుచు శ్రీ పండిట్‌నెహ్రూజీకి జాబునొకటి వ్రాయవలయు" నని కోరెను. తదనుగుణముగా శ్రీ పుకార్‌మల్ దధీచిగారి కోరిక ప్రకారము శ్రీనెహ్రూ జీకి ఉత్తరము వ్రాసి చెక్కు పంపితిని. శ్రీ నెహ్రూ పండితుని కార్యదర్శి ఆ ధనమును స్వీకరించి, నాకొక ప్రీతి ప్రేమ పూర్వకమయిన ప్రత్యుత్తరమును వ్రాసి పంపెను.



నెహ్రూజీ యావజ్జీవితము – క్రీస్తు మహాశయుని " నాయొద్దకు రండు" అను పలుకుల పదేపదే పలుకునట్టి పిల్లల చెలికాడు.

ఈ రోజున సముద్రమువైపు, పర్వతశ్రేణులవైపు తిరిగి, ధ్యాన మొనరింప కోరుచుండ, ప్రపంచమునందలి జీవితపు నిరాశా దుఃఖముల గూర్చి ఆలోచింప దొరకొన హృదయభార మధికమయ్యెను. ఇంతలో చిన్న పక్షియొకటి నాప్రక్కనే యెగురుచు నిట్లు పాడుచు నన్నుద్బోధించునట్లయ్యెను. "ఏల విచార భారానుత హృదయుడ వయ్యెదవు...?" చాలు చాలు! పరిణామమున, పరిణామ రాహిత్యమును గుర్తెరింగి, మర్త్యమున నమర్త్యమును గుర్తించి, ఆనందమొందుము" అని నన్ను అడిగినట్లు తోచెను. ఇప్పుడు నెహ్రూజీ పూర్వముకంటె నధికముగా స్వేచ్ఛావంతుడై, సుఖియై–ఆ చిన్న పక్షివలె సంతృప్తిగొని, విశ్వాసము, విముక్తుల గూర్చి "గతమును భూగర్భమున నణగద్రొక్కి, అస్పష్టమయిన భవిష్యత్తునుపేక్షించి, ఈ ప్రత్యక్షమయిన వర్తమానముననే, సుఖముగా నుండ యత్నింపుము" అను సందేశము నొసంగు చుండెనని తోచి ఆనందమొందితిని.

భగవద్గీతలో నుండి ఎల్లరు తరుచుగా మరణమునుగూర్చి చదివి చూపు నీ శ్లోకమును దిలకింపుడు–

వాసాంసి జీర్ణాని యథా విహాయ
నవాని గృహ్ణాతి నరో పరాణి
తథా శరీరాణి విహాయ జీర్ణాని
అన్యాని సంయాతి నవాని దేహీ భగ 2–22

మానవుడు చినిగిన వస్త్రముల విసర్జించి,నవీనములయిన యితర వస్త్రముల నెట్లు ధరించునో, అట్లే జీర్ణములయిన శరీరములను విడిచిపుచ్చి దేహియైన ఆత్మ నూతనములయిన శరీరములను పొందును.

శ్రీరమణ మహర్షులు "మరణమును"గూర్చి వ్రాసిన యీ పంక్తులను హృదయ మున కూరటగల్గించునట్టివి.

"భౌతిక శరీరపు మరణానంతరము మనస్సు స్వప్న రహితమైన సుషుప్తియందు వలె, కొంతకాలము స్తబ్ధముగా నుండిపోవును. (చైతన్య రహితముగ నుండిపోవును); అప్పుడది సంసార రహితముగ నుండిపోవుటచే నయ్యది (ఉపాధి) శరీరరహితముగ నుండును. కాని, వెంటనే, అయ్యది వేఱొక క్రొత్త ప్రపంచమున క్రొత్త శరీరమున చైతన్య వంతమైయుండును. ఇయ్యదియే సూక్ష్మ శరీరము వేరొక ఉపాధిని పొందు వరకు నీ సూక్ష్మ శరీరమునందే యుండును; వేరొక భౌతికోపాధిని గ్రహించుటయే

పునర్జన్మ. కాని, భౌతిక జీవిత సంబంధమైన కర్తృత్వమునుండి విడివడిన తన్ను తానెరింగిన జ్ఞానియొక్క మనస్సు. మరణము వలన నెట్టి మార్పును చెందక యట్లే యుండును; భ్రాంతి పంక్తులు అతనికింక నెన్నడునులేవు. ఆత్మజ్ఞానముచే నాశనము చేయబడువరకు, ఈ విధానమున మనస్సంబంధమయిన ప్రత్యభిజ్ఞలను, భ్రాంతులను మనస్సే సంకల్ప వికల్పాత్మక మయినదగుట కల్పించుచుండును. మరణమనగా తన నిజ స్వభావమును మరచిపోవుటయే."

'లాంగ్‌ఫెలో' మృత్యువును గూర్చి యేమి వ్రాసెనో గమనింతము.

మరణమన్నదియే లేదు; మరి మరణము
వలెకనంబడు నట్టిదొక పరిణామము;
మర్త్య శ్వాస నిబద్ధమైన జీవితము
స్వర్గ జీవితపు నగరోప కంఠసీమ
దాని ద్వారమునేమనము మరణ మందుము.

నిజముగా మరణమే లేదు. అందును ప్రత్యేకముగా మన పండిత జవహర్ లాల్‌నెహ్రూ మహాశయునకు ఆతడు స్వార్థరహిత సేవా సర్వస్వము; విశ్వజనీన ప్రేమ విధానము; అతని దృష్టి విశ్వము నావరించినది. ప్రపంచమునందలి మహాత్ములైన వారందరు దేశాధ్యక్షులు, ప్రధానమంత్రులు, రాజులు, రాణులు నాయకులు, వివిధ దేశీయులు, ప్రాక్పశ్చిమ దేశపు వివిధ మతస్థులు అందరును ఆ మహాత్మునకు జోహార్లు అర్పించుట, అభినందనముల ప్రకటించుట, నిజముగా హృదయ విద్రావకముగ నున్నది. దీని ప్రయోజనము ఏమి? ప్రపంచమందంతట నిండియున్న తన భక్తుల, అనుచరుల, స్నేహితుల, అభిమానుల గౌరవాభినందనములను నెహ్రూజీ కోరునా?

కాలభ్రమణమున ఈ జోహార్లు, అభివందనములు, ప్రశంసలు, ఈ వాక్య పరంపర కొట్టుకొని గతించిపోవకుండునా? నెహ్రూ పండితుడు తన 74 సంవత్సరముల జీవితము నంతటిలో పరిశ్రమించెను. జీవించెను, ప్రపంచ శాంతి కొరకు తన తుది నిశ్వాసమువరకు జీవితము అంకిత మొనరించెను. గొప్ప గొప్ప ప్రశంసలను పొగడ్తలను, నెహ్రూ మహాశయునకు జెల్లించిన ప్రపంచమునందలి వివిధ దేశముల నాయకులందరు ఏదైన నొక యుపయోగకరమయినట్టిది. ప్రత్యక్షమైనట్టిది యొకటి చేయ సత్య సంకల్పము గల్గినట్టివారయిన పక్షమున మనము, వారు, చేయగలిగిన దెల్ల, ఆ దివ్యమూర్తి మరణ చిహ్నముగ, భూమియందు నలుమూలల



శాంతిని, సౌహార్ద్ర సౌమనస్యములను గల్గించుటకు ప్రయత్నించవలయును. మనము నెహ్రూ పండితునకు చెల్లింపదగిన ప్రశంస. ఒండొరులపై ద్వేషము, ఈర్ష్యలను విస్మరించుట, వర్ణముల మతభేదముల విసర్జించుట.

ప్రత్యేక వ్యక్తులయందు శాంతి సౌమనస్యములు వర్థిల్లుగాక! జాతులయందు దేశములయందు సామరస్యము ప్రేమలు వర్థిల్లునుగాక!

ఈ నెహ్రూ మరణము పేరిట, అనతి యుదాత్తమైన ఆత్మ సామరస్య శాంతి యుతమయిన యొకే యొక ప్రపంచ సంసారమున మనల నందర నేకీకృతులను చేయును గాక! శ్రీ నెహ్రూ పండితుని మరణ స్మారకముగా ఒక నినాదము ఒక హెచ్చరిక మనము ఉచ్ఛరించెదముగాక!

"కయ్యములు, యుద్ధములింక నుండకుండుగాక! శాంతి ప్రేమలు వర్థిల్లుగాక!" ఏలయన మనమందరము నొక యవిబాధ్యమైన ఆ పరమాత్మ బిడ్డలము కనుక.

నెహ్రూజీ సజీవులయి యుండగా దేనిని సాధింప పూర్ణముగా విజయవంతులు కాలేకపోయిరో, నిజముగా మనమందర మాతనిని ప్రేమించుచున్న పక్షమున ప్రపంచమున శాంతిని, శాశ్వతముగా నెలకొల్ప మనము ప్రయత్నించెదముగాక!

విశ్వజనీనమైన యీ ప్రార్థనతో పండిట్ నెహ్రూజీకి సమర్పించు జోహార్లు ముగింతును.

ఒకేయొక విశ్వసౌభ్రాతృత్వము
ఒకే విశ్వ సౌజన్యము
ఒకే యాధారము; ఒకే యధికారము
మనల నెలకొల్పి పాలించునట్టి యొకే
యొక ధర్మ సూత్రము
మనల నందర మలచునట్టి యొకే
యొక ప్రయోజనము
ఎల్లప్పుడు ప్రేమతో నింపునట్టి
యొకే సజ్జీవితము (అగుగాక)
కోపము, క్రోధము, ద్వేషము
మనల నిరాధారముల నొనర్చినవి;
వాని పాలనము ముగిసినది.
జాతి,మతము, వర్ణము,
గత కాలమునందే మ్రగ్గిపోవునుగాక!

జీవితమంతయు నొకటేయని
తుట్టతుద కిప్పటి కయిన
మానవుడు ప్రబుద్ధుడై
యెఱుంగును గాక!

ఓం ఓం ఓం

నిరాటంకము, ధైర్యవంతము, విజయవంతము, నిత్యమునయిన నెహ్రూజీ ఆత్మ, పూర్వముకంటె నధికముగా, అతని భావముల నమలు పరుపగోరు మన హృదయముల నిప్పుడు ప్రవేశించి, ప్రత్యేక వ్యక్తులకు శాంతిని గల్గించుచు, ప్రపంచ మందలి జాతులకు సౌమనస్యము సద్భావమును గలిగించుచు ప్రపంచమునకు ఆశీర్వాదముల నొసంగుగాక !

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

సారాంశము

ఈ సందేశము యొక్క సారాంశము; ఈ రచయిత యొక్క సత్యాభికాంక్షయు నేదియన–

హిందూదేశమున ప్రతివ్యక్తియు కాదు, ప్రపంచముననెల్లరు, పండిట్ నెహ్రూ జీని ప్రేమించువారందరు అతని అడుగు జాడలలో సంచరించుచు, సజీవ నెహ్రూలై యుండగోరుచుందురుగాక!

నెహ్రూ మనవద్దనుండి ప్రశంసావచనములకోరడు. కోరునట్టివి, స్వార్థ రహిత మైన సేవా కార్యశూరత, తూర్పు పడమరల దేశములలోని బిడ్డల నందరిని గిరిచుట్టి సంచరించు నాపండితుని, ప్రియమైన, సన్నిహితమైన ఆత్మ కోరునట్టి దీ కార్య శూరత్వమే.

ఈ నా జోహార్లు పండిట్ నెహ్రూజీకేగాదు; ఓ ప్రియమైన చదువరీ–నీకును గూడ ! నీ కొకనికే కూడకాదు–

ఒకే ప్రపంచము, ఒకే దైవము, ఒకే మతము, ఒకే ప్రేమ తత్త్వము, ఒకే విశ్వజనీనత–ఎవ్వరిని తొలగగొట్టక గుదిగట్టి సన్నిహితముగా జేర్చుకొనునట్టిది కలిగిన ప్రపంచ పౌరుల కెల్లరకు నా జోహార్లే!

ఓం తత్ సత్ ఓం

**సమర్పణము**

**ఎవడు అహర్నిశములు ప్రపంచమందలి బిడ్డల యెల్లర సౌఖ్యము నపేక్షించి, పరిశ్రమించి, జీవించెనో యట్టి శ్రీ పండిట్ నెహ్రూజీ అనుచరులకు, భక్తులకు, మిత్రులకు, అభినందించునట్టి వారికి, ఈ నా వినయపూర్వక ప్రేమపూర్ణమయిన జోహార్లు అంకితము చేయుచున్నాను.** (శాంతి జూలై 1964)



## కీ.శే. శ్రీ ద్వారం వెంకటస్వామి నాయుడుగారు

కీర్తి శేషులైన పిఠాపురం కాపురస్తులు శ్రీ సముద్రాల రంగాచార్యులుగారు, శ్రీ ద్వారం వెంకటస్వామినాయుడుగారి శిష్యులై వారివద్ద ఫిడేలు వాయిద్యం నేర్చు కొనిరి. శ్రీ రంగాచార్యులుగారు నావద్ద కైలాసములోను, వాల్తేరు ఆశ్రమములోను, తోటపల్లి ఆశ్రమంలోను, చాల సంవత్సరములు సంగీత గానము చేయుచు గడిపెడివారు. వారి తనయుడు పురుషోత్తమాచార్యులుగారు కూడ సంగీత విద్వాంసులే. తరుచు రేడియోలో వారు పాడుచుండెడివారు. ఇప్పుడు వారుగూడ యౌవన మునందే కీర్తి శేషులైరి. మృత్యువు యౌవనులను, ముదుసలులను,చివరకు పసిపాప లనుగూడ విడువదుగదా! కాలము సమీపించినప్పుడు అందరును ఇష్టతనో, అయిష్ట తనో మృత్యుముఖమున బడక తప్పదు. మృత్యువునకు స్వాగతము జెప్పుటకు సిద్ధ పడి యున్నవారు అదృష్టవంతులు.

శ్రీరంగాచార్యులుగారి ఇంట్లో బాల,బాలికలేగాక వారి మంచములుగూడ సంగీతముపాడుచుండునని తరచు చెప్పుకొనెడివారు. వారు నావద్ద వున్నప్పుడు తరచు శ్రీ వెంకటస్వామిగారి సంగీత నైపుణ్యత, ఫిడేలు మీద వారికివున్న గొప్ప ప్రావీణ్యత గురించి ప్రసంగించుచు శ్రీ నాయుడుగారిని యెప్పటికైనను నావద్దకు తీసుకొనివచ్చి దేశప్రసిద్ధి కెక్కిన వారి ఫిడేలు వాయిద్యమును నాకు వినిపింపజేసెద నని జెప్పుచుండెడివారు. కొన్ని ఉత్తరములుగూడ శ్రీ వెంకటస్వామి గారిని ఆహ్వానిం చుచూ వ్రాయబడెను. శ్రీనాయుడుగారు అంధులై యెంతయో గొప్ప సేవను సంగీత విద్యలో జేయుచుండిరని వారి సేవను కొనియాడుచు వారికి నేత్రదృష్టియున్న యెంతయో బాగుండెడిదిగదాయని తలచి ఒక వుత్తరమునాకు రెండు నేత్రములు అనవసరముగాన, నా పనులన్నియు ఒక్క నేత్రముతో జేసుకొనుటకు చాలునని నారెండవ నేత్రమును నిపుణులైన డాక్టరు సహాయముతో శ్రీ వెంకట స్వామి నాయుడుగార్కి ఇవ్వగల్గిన నా జీవితము ధన్యవంతమై ఆనందించునని, శ్రీ నాయుడుగార్కి కైలాసములో నుండగా వ్రాసితిని. ఇటులనే సంవత్సరములు గడచి పోయెను. నాకు సంగీతమందున్న అభిరుచిచే నాయుడుగారి ఫిడేలు గ్రామఫోన్ ప్లేట్లు ఆనందభైరవి రాగము గల్గినది తెప్పించి అప్పుడప్పుడు గ్రామఫోను మీద వినుచుండ శ్రీ నాయుడుగారు అప్పుడు నా సమక్షమందున్నట్లే తృప్తిపడుచుండు వాడను. వారు నావద్దకు రానిలోటు యెన్నడును పొందలేదు.

ఈ మధ్య నేను హైద్రాబాదు వెళ్ళినప్పుడు శ్రీ విజయవిల్లాలో నుండగా, డాక్టరు శ్రీచెన్నారెడ్డి గారు పట్టణములోనికి వెళ్ళుచుంటిననియు ఆ రోజు శ్రీ ద్వారం వెంకటస్వామిగారి సన్మాన సభ జరుగుననియు దానికి తాము అధ్యక్షత వహించ

వలసియున్నదనియు, త్వరలో తిరిగి వచ్చెదననియు నాతో జెప్పగా, అప్పుడు నేను శ్రీ డాక్టరు గారితో చెప్పినదేమనగా శ్రీ ద్వారం వెంటకస్వామి గారు ఆశ్రమ భక్తు లనియు, నన్ను జూచుటకు చాలకాలమునుండి వచ్చెదనని జెప్పుచుండిరనియు నే నిప్పుడు ఇచ్చటనే యుంటినిగాన వీలునుబట్టి వచ్చినట్లయిన వారిని జూచి ఆనందిం చెదననియు జెప్పగోరెదనని జెప్పగా డాక్టరు శ్రీచెన్నారెడ్డిగారు సన్మాన సభకు వెళ్ళి నా సందేశమును శ్రీ నాయుడుగార్కి తెలియజేసిరి. వారు చాల ఆనందించి, హైదరా బాదులో వారు మూడురోజులుందురనియు, వారు వెళ్ళేలోగా తప్పక వచ్చెదనని కబురుజేసిరి. మూడురోజులలో శ్రీనాయుడుగారు,విజయవిల్లాకు నేనుండెడి బసకు వచ్చెదరని జూచుచుండ, రెండవరోజున శ్రీ ద్వారం వెంకటస్వామినాయుడుగారు హృదయ వ్యాధికి హఠాత్తుగా చనిపోయిరనెడి విషాదకరమైన వార్త పిడుగుపడినట్లు వినిపించెను. చివరికి వారి సందర్శన భాగ్యము నాకు ఎంత ప్రయత్నించినను లభింపకపోయినది గదాయని విచారించితిని. మృత్యువు ఎప్పుడు వచ్చునో, ఎటుల వచ్చునో మనుష్య మాత్రులకు తెలియదుగదా!

సీ. పాంచభౌతికము దుర్బలమైన
కాయం బదెప్పుడో విడచుట యెఱుకలేదు
శతవర్షములదాక మితము జెప్పిరిగాని
నమ్మరాదామాట నెమ్మనమున
బాల్యమందో మంచి ప్రాయమందో లేక
ముదిమియందో లేక ముసలియందో
యూరనో యడవినో యుదక మధ్యముననో
యెప్పుడో నిశ్చయము బుద్ధిమంతుడైన
దేహమున్నంతలో మిమ్ము తెలియవలయు
భూషణ వికాస శ్రీ ధర్మపుర నివాస, దుష్ట
సంహార నరసింహ దురితదూర॥

అనెడి అనుభవనీయమైన పద్యము నరసింహ శతకము నుండి నాకిప్పుడు జ్ఞప్తికి వచ్చుచుండెను.

ఇక వేయిమాటలు వ్రాయుటేల? శ్రీ ద్వారం వెంకటస్వామిగారి ఫిడేలు వాయిద్యము వారిని వారి వాయిద్యమును ఈ నా చర్మ చక్షువులతో నేనెన్నడును చూడజాలకున్నను, ఇంకను వారి ఫిడేలు మధురగానము నాకు వినిపించుచునే యుండునని చదువుటకు మా పాఠకులు కొందరు ఆశ్చర్యపడవచ్చును.



కండ్లున్న వారు జూడవచ్చునని, చెవులున్నవారు వినవచ్చునని కీర్తి శేషులైన శ్రీ వెంకటస్వామి నాయుడుగారి ఆత్మ నిరంతర శాంతిని, అనుభవించుచుండుటయే గాక, వారి సంగీత గానము నిరంతరము భక్తకోటి కంతకు, ముఖ్యముగా సంగీత విద్వాంసులకు వుత్సాహమును, ఆనందమును శాంతిని యొసంగు గాక!

శ్రీనాయుడుగారు యొక ప్రసిద్ధికెక్కిన సంగీత విద్వాంసులగుటచే అనేకమైన సభలలో శ్రీ నెహ్రూ పండితునిచే గూడ ఢిల్లీలో వారిచ్చిన ఉపన్యాసములో పొగడ్తల నందుకొనిరి. వీరిని వెంకటస్వామిగారు అని పిలుచుటకు బదులు ఫిడేలు నాయుడు గారనే వాడుకగా పిలువబడేవారు. అంత్య ఘడియ వరకు శ్రీనాయుడుగారు వారి ఫిడేలు వాయిద్యముచే సంగీతప్రియులనందరిని ఆనందపర్చుచునే యుండిరి.

శ్రీ ఫిడేలు నాయుడుగారిప్పుడు ఏ లోకములో నున్నను, అచ్చటనుండి గూడ ఫిడేలు వాయించుచు, మానవకోటికి సేవజేయుచున్నారనే నా నమ్మకము దుర్లభమైన మానవజన్మను మానవ సేవలో సద్వినియోగము జేయువారి జీవితము లెంత ధన్యవంతములు !

ఉ॥ ఏను మృతుండ నౌదునని యింత భయంబు మనంబు లోపలన్
మానుము సంభవంబుగల మానవకోట్లకు జావు నిత్యమౌ
గాన హరిం దలంపు మిక గల్గదు జన్మము నీకు ధాత్రిపై
మానవనాథు పొందెదవు మాధవలోక నివాస సౌఖ్యముల్ ॥

ఓం సర్వేషాం స్వస్తిర్భవతు!
ఓం సర్వేషాం శాంతిర్భవతు !
ఓం సర్వేషాం పూర్ణం భవతు !
ఓం సర్వేషాం మంగళం భవతు.
లోకాస్సమస్తా స్సుఖినోభవంతు
ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

(శాంతి ఏప్రియల్ 1965)

## అమరజీవి శ్రీ నారాయణరావు

మన ఆశ్రమ శ్రేయోభిలాషియు, పరమ మిత్రుడును నగు బారిష్టరు శ్రీ నారాయణరావుగారు అమరులైరి.

బెంగుళూరులోని ప్రభుత్వ న్యాయస్థానమున కార్యదర్శిగానున్న బారిష్టరు శ్రీ నారాయణరావుగారు మన ఆశ్రమమునకు పరమ మిత్రులు; ఆశ్రమ శ్రేయోభిలాషులు. వారు మరణించిరను వార్త టెలిగ్రామ్ ద్వారా తెలిసి చాల ఆశ్చర్య సంభ్రమములనొందితిని. వారు ఆశ్రమమునకు అత్యంతాప్తులు. నిరంతరము ఆశ్రమాభివృద్ధిని కాంక్షించెడివారు, నిస్వార్ధ నిరాడంబర మౌనభక్తులు. సుమారు ఏబది సంవత్సరముల క్రితము తూర్పుగోదావరి జిల్లాకలెక్టరుగా పనిచేసిన శ్రీ యు. రామారావు గారి పుత్రులే శ్రీ నారాయణరావుగారు. ఇప్పటికి సుమారు ఏబది సంవత్సరములకు పైన శ్రీ యు.రామారావుగారు అత్యంత దయతో నాకు ప్రథమముగా అమెరికా వెళ్లుటకు పాస్‌పోర్టు నొసంగినవారు. మరియు ఈ రామారావుగారి పుత్రికయు ఆశ్రమ భక్తురాలగు శ్రీమతి రాధాభాయికినీ ప్రఖ్యాత బోను స్పెషలిస్టులయిన అస్థివైద్యులగు డాక్టరు శ్రీ యం.జి.కినీగారి ధర్మపత్నియని తెలిసి చాల ఆశ్చర్యానందములు పొందితిని. శ్రీ నారాయణరావుగారి ధర్మపత్నియు, వారి బంధుమిత్రులుగూడ ఆశ్రమ శ్రేయోభిలాషులే!

ప్రభుత్వములో గొప్ప పదవిని నిర్వహించుచున్నను, శ్రీ నారాయణరావుగారి జీవితము బహు నిరాడంబరము, ఆదర్శవంతమునై యుండెడిది. వారు వారి జీవితమంతటిలో నాతో సుమారు పది పండ్రెండు వాక్యములను మాత్రమే మాట్లాడి యుందురని తలంచెదను. అయినను ఎక్కువగా మౌనముగా వుంటూ నిరాడంబరముగా సహాయ మొనర్చెడివారు. భక్తిపరులై, గొప్ప యుద్యోగములో వున్నందుకు అహంకారములేక నిరంతరము దయ,కరుణతో యుండెడివారు.

ఈమధ్య కోటగిరి శాంతికేంద్రమునుండి తిరిగి తోటపల్లి కొండలకు వచ్చుచు దారిలో శ్రీనారాయణరావుగారు వారి సతీమణి బెంగుళూరులోని వారి నూతన గృహములో ఏర్పాటుచేయబడిన శాంతి సభలో పాల్గొనుట సంభవించెను. ఆ సభకు శ్రీ నారాయణరావుగారు వారి స్నేహితులను చాలామందిని ఆహ్వానించి పరిచయ మొనర్చి అత్యంత దయతో మాకందరకు సపర్యలొనర్చిరి. నేను అప్పుడిచ్చిన సందేశమును శ్రీ నారాయణరావుగారు నేత్రముల వెంట ఆనంద బాష్పములు రాల్చుచు వినుచుండుట నాకిప్పటికిని ఆనందముతో గుర్తుకు వచ్చుచుండును.



మన నారాయణరావుగారు అమరజీవి. దైవ పరితాపముగల నిస్వార్థపరులు మరణించినను జీవించి యున్నవారితో సమానము. స్వార్థాహంకారులు బ్రతికియున్నను మరణించినవారితో సమానము. శ్రీ నారాయణరావుగారి నిస్వార్థ నిరహంకార జీవితము ఇతరుల కందరకు ఆదర్శవంతమై వెలయుగాక! వారి పవిత్రాత్మ పూర్ణశాంతిని బొంది దైవములో విశ్రాంతిని బడయుగాక !

భక్తురాలగు శ్రీ నారాయణరావుగారి సతీమణికి, వారి బిడ్డలగు చి॥ రాణి, గీత, రంజిత్‌లకు మా గాఢ సంతాపములు వెలిబుచ్చుచున్నాము.

దైవము వారిని, వారి బంధుమిత్రులను ఈ అనివార్య సంతాపమునుండి దాటించి నిరంతరము శాంతిని ప్రసాదించుగాక !

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు

ఓం ఓం ఓం

(శాంతి జూన్ 1965)

## స్వామి రామానందతీర్థజీకి శ్రద్ధాంజలి

భగవత్కార్యమునకై జీవితమంతయు నర్పించినట్టి స్వామి రామానంద తీర్థజీకి శ్రద్ధాంజలి.

ఎవరి జీవితము బీదలకు, దుఃఖితులకు మధుర స్వప్నమో, ఎవరి ఆత్మ సమర్పణ మాతృదేశ స్వాతంత్ర పోరాటమున ధృవతారయై వెలుగొందుచున్నదో, ఎవరి జీవిత త్యాగనిరతితో దైవమునకు నివాళి గావింపబడెనో అట్టి ఆదర్శ కర్మ యోగియగు స్వామి రామానందతీర్థజీకి జోహారులు.

వారిని నిజముగా మనము ప్రేమించుచుండిన ఎడల వారి ఆత్మ పరిపూర్ణ స్వేచ్ఛా స్వాతంత్ర్యములతో ఉన్నత గతి నొందినందులకు మనమానందించవలెను.

మరణమనగా అనంత సౌధపు కవాటమును తెరుచుబంగరు బీగము–

నిస్వార్థసేవతో, విశ్వమానవ ప్రేమతో సర్వతోముఖమగు వారి యాత్మ గతమునందుకంటె హెచ్చుగా ఇప్పుడే పరివ్యాప్తము చెందియున్నదనెడి తలంపు నాకెంతయో ఆనందమును, ఉపశాంతి కలిగించుచున్నది.

మహాత్మాగాంధీ, వినోబాజీ అడుగుజాడల ననుసరించుచు మహాసమాధి నొందు వరకు విశ్వశాంతికై దివారాత్రములు కష్టించుచునే యుండిరి.

మానవ సేవాపిపాసులగువారు, దుర్బలకాయముతో ప్రతి స్థలమున అనువగు నారికేళసలిలముకై తిరుగాడిరి. కొన్ని ఎడల ఆ సేవా పిపాస నివారించు నారికేళ ములే కరువయ్యెడివికదా ! కాని నేడు యీ జగతి యందలి నారికేళములన్నియు అర్పింపబడు చున్నవి. కాని నేడు శ్రీవారు లేరు.

మనము నిజముగా స్వామి రామానందజీని ప్రేమించుచున్న ఎడల వారి మనోవాంఛితములగు మానవసేవ మాతృదేశ సేవ ఒనగూర్చుటయే ఏకైక సాధనము. స్వామి రామతీర్థ సారస్వతముచే ప్రేరితులై, స్వామిరామ్ శిష్యులును, రామానంద తీర్థజీ గురువర్యులును అగు శ్రీ స్వామినారాయణచే తన్మార్గము నవలం భించిరి. స్వామి నారాయణచే స్థాపింపబడిన రామతీర్థలీగ్ నేడురామతీర్థ ప్రతిష్ఠాన్ అను పేరిట లక్నోయందున్నది. స్వామి నారాయణ తదనంతరం వీరే దానికి అధ్యక్షులై యున్నతమగు స్వామి రామ్ సందేశములను విశ్వవ్యాప్త మొనగూర్చిరి.

1973 అక్టోబరులో జరుగబోవు స్వామిరామ్ శతజయంత్యోత్సవము వరకు తాము జీవించవలెనని వీరు కాంక్షించిరి. విశాల విశ్వమున శాంతి నెలకొల్పుటకై, ముఖ్యముగా స్వామిరామ్ అనుచరులకు, భక్తులకు ఎంతయో ఉపయోగించునట్లు యీ శతజయంతి జరగవలెనని వారు తీవ్రముగా కోరియుండిరి. నిజముగా వారియందు మనకు ప్రేమ యుండిన వారు కాంచిన కలలు కార్య రూపముదాల్చునట్లొన గూర్చుటకు తోడ్పడుదుముగాక. ఈ శతజయంతి మానవ కల్యాణమునకై తోడ్పడునట్లొన గూర్తుముగాక! అనంతమగు వారి యాత్మ మన అందరియందును నేడు స్పందించుచు మనలను కార్యోన్ముఖులను చేయుగాక!

స్వామి రామతీర్థ యీ క్రింది వాక్యములు వారు తరుచు పల్కుచుండువారు. "సంఘసంస్కర్తలు కావలెను. ఇతరులను సంస్కరించువారు కాదు. తమ్ము తాము సంస్కరించుకొనగలిగినవారు, ముఖ్యముగావారు "జీవమొక్కటియే" అని పల్కెడివారు. ఓ దైవ బిడ్డలారా! పవిత్రమగు రామానందజీ అడుగుజాడలలో నడచుచు మన మీ అవకాశమును చక్కగా వినియోగించుకొందముగాక! వ్యక్తి శాంతియే విశ్వశాంతికి మూలకందము.కావున ప్రథమమున శాంతిని మన హృదయములందు ప్రతిష్ఠించుకొని విశ్వశాంతిని వ్యాప్తమొనర్తుముగాక.

ఇప్పుడుమనందరి నుండి ప్రస్ఫుటమగుచు, ప్రకాశించుచున్న వారి పవిత్రాత్మకు శ్రద్ధాంజలి, ఇదియే మీ ఓంకారుని ప్రార్థనయై యున్నది.

ఓం ఓం ఓం

(శాంతి మార్చి & ఏప్రిల్ 1972)



## మా రామం

రామం ధన్యజీవి. ఆయన ధర్మపత్ని శ్రీమతి రత్నమాంబ, మహాభక్తురాలు. శ్రీ శాంతి ఆశ్రమం స్థాపించియే 52 సంవత్సరములాయెను. భక్తి,ప్రేమలతో నిండి యున్న ఆ పుణ్యదంపతులు నా జీవితములోనకు వచ్చెడి సరికి, ఆశ్రమమే లేదు.

నేను హిమాలయ పర్వతములకు తపస్సుచేయుటకు,పూర్వ జన్మ సుకృతముచే చాల చిన్న వయస్సులోనే వెళ్ళగలిగితిని.

శ్రీరామం, రత్నమాంబల ప్రేమకు బద్ధుడనై సంవత్సరమున కొక్కసారి వారి గృహమునకు వచ్చి, కొలది రోజులు వారి గృహమునందే శాంతిగా గడిపి, భక్తులందరకు, ఉపదేశములిచ్చి, బోధలు జేసి, మరల హిమాలయములకు వెళ్ళు చుండెడివాడను.

అంత దూరప్రదేశము నుండి ప్రతి సంవత్సరము వచ్చుచు వెళ్ళుచుండుట కంటే, యీ ప్రాంతములలోనే, ఒక చక్కనైన నిర్జన ప్రదేశములో ఆశ్రమము స్థాపించిన, నా తపస్సునకు, భక్తుల వృద్ధికి తోడ్పడునని చాలమంది భక్తులుకోరుటచే, దైవ నిర్ణయము ప్రకారము, శాంతి ఆశ్రమము తోటపల్లి కొండలమధ్య ఒకానొక శుభముహూర్తమున జనవరి 1917 సంవత్సరములో స్థాపితమయ్యెను.

ఈ ఆశ్రమం స్థాపించుటకు, దాని పోషణకు ఆశ్రమ వృద్ధికి రామం, రత్నమాంబలే ముఖ్యకారకులు. అప్పుడు కీకారణ్యముగా యున్న అడవిలో ఒకే మామిడిచెట్టు మాత్రము గలదు. దాని ముందుగనే మొదట మా ప్రార్థన మందిరము శ్రీరామం, రత్నమాంబలచే నిర్మింప చేసితిని.

నేను చిన్న వయస్సునందే అమెరికా వెళ్ళినప్పుడు, వారి తనయుని ఆత్మా రాంను, నాతో పంపిరి, మా యిరువురి ప్రయాణపు ఖర్చులు, దుస్తులు,తదితరమైన ఖర్చులకు, చాల భాగము వారే తోడ్పడిరి.

ఇప్పుడు స్వీయ చరిత్ర వ్రాయుటకు యీ వ్యాసము ప్రారంభింపలేదు. శ్రీరామం, రత్నమాంబలకు నా యందు ఎంత అపారమైన భక్తియేగాక, ప్రేమ,నమ్మ కము చిన్నతనమునుండియు గలవో తెలియజేయుటకు పై విషయములు వ్రాయ బడెను. 50,60 సంవత్సరములు యిటులనే ఆశ్రమ సేవచేయుచు చివరకు ఆశ్రమం లోనే ఒక కుటీరము నిర్మించుకొని, రామం, రత్నమాంబలు శాంతిగా తృప్తిగా కాలము గడుపుచు, ప్రార్థనలలో, పురాణకాలక్షేపములలో పాల్గొనుచు వారి జీవితము లను ప్రశాంతముగా గడప సాగిరి.

మా రామంకు దగ్గర దగ్గర 80 సంవత్సరములు వయస్సు వుండుటచే వినికిడి కొంత తగ్గసాగెను. రామం చివరి రోజులలో వినికిడి యంత్రము నొక్కటి సంపాదించుటకు ప్రయత్నము చేయుచుండువారు. వయస్సు ముదురు చుండుటచే, దుర్బలత్వముగా నున్నను, ఆశ్రమం అంతా తిరుగుచు, ఎండ వాన అనక, కట్టడముల పనులు చేయించుచుండెడివారు.

చివరి రోజులలో తనను ఎటుల నైనను వాల్తేరు ఆశ్రమంనకు తీసుకొని వెళ్ళి అచ్చట ఆస్పత్రిలో నిపుణులైన డాక్టర్లచే వైద్యము చేయించమని తరుచు కోరుచుండెడివారు. ఎప్పుడు నా వద్దకు వచ్చినను, నా హస్తమును తీసుకొని తన శిరస్సు మీద వుంచుకొని, ప్రణవమును "ఓం" పాడెడివారు. పాదములకు నమస్కరించుచు, ఎంత వలదన్నను కొంత తడవు పాదసేవ చేయుచుండెడివారు, ఎంత నీర్సముగా, దుర్బలత్వముగా యున్నను చెవులు వినిపించక పోయినను, ఆదివారపు ప్రార్థనకు నియమముగా వచ్చుచుండెడివారు. బలహీనతచే ఒకనాడు ఆదివారపు ప్రార్థన నుండి వెళ్లుచుపడిపోయెనని విని చాల విచారించితిని. రామం నడవ జాలనప్పుడు, నేను క్రింది ఆశ్రమంనకు వెళ్లినపుడు, ఆయన కుటీరమునకు వెళ్ళి, అప్పుడప్పుడు చూచుచుండెడి వాడను, అపుడు గూడ నా హస్తమును తీసుకొని కండ్ల కద్దుకొనుచు, ప్రణవమును తన శిరస్సుమీద వ్రాయమని కోరెడివారు.

ఇటీవల ఆయన శరీరము అనారోగ్యముగా యున్నదని, కాకినాడలో నిపుణులైన ఆశ్రమభక్తులైన డాక్టర్లచే పరీక్ష చేయించెదమని ఎంత చెప్పినను, ఎచ్చటకూ వెళ్లనని ఆశ్రమంలోనే తన ప్రాణమును వదలుటకు కోరుచుంటినని జెప్పిడివారు. రామం శరీరములో నొప్పులు హెచ్చుగానుండుటచే ఆయనకు యిష్టములేకున్నను, ఆశ్రమం వ్యానులో కాకినాడ తీసుకువెళ్లి పరీక్ష చేయించుటకు నిశ్చయమయ్యెను.

30-1-69వ తేది రాత్రిగూడ ఆయనకుటీరమునకు వెళ్లి ఆయన చెంత కూర్చొని, ప్రార్థన ధ్యానాదులుచేసి, ఆయనచేత గూడ ప్రణవగానము చేయించితిని. ఆయన కోరినట్లు ప్రణవము బీజాక్షరమును రామం శిరస్సుమీద సహస్రార స్థానమున వ్రాయుట జరిగెను.

శ్రీరామం 31-1-69 ఉదయమే లేచి కాలకృత్యములు తీర్చుకొని పడక కుర్చీలో కూర్చుని ప్రార్థన చేసుకొనెను. ప్రార్థనయైన తదుపరి, మంచము మీదకు వచ్చి పరుండి ధ్యానము చేసుకొనుచు శరీరమునుసునాయాసముగ వదలివేసెను, "రామం ఎంత ధన్యజీవి!" ఆయనకు యిష్టము లేనప్పుడు బలవంతముగా ఆశ్రమం నుండి తీసుకు వెళ్లుచుండిరిగదా యని ప్రాణమును యిచ్చటనే హఠాత్తుగా, ఏ



బాధయు లేకుండా, ఈశ్వరాను గ్రహముచేత సునాయాసముగా వదలివేసినట్లు తోచుచుండెను.

ఈ విషాదకరమైన వార్తనువినిన వెంటనే నేనువెళ్లి రామం శరీరమును చూచితిని. రామం శరీరములో లేడుగాని, ఆయన ఆత్మచుట్టును నిండియున్నట్లుండెను. ఆశ్రమవాసులు ఆయన శరీరము చెంతనే కూర్చొని భగవద్గీత 18 అధ్యాయములు పారాయణ చేయుచుండ, గురుకుల బాల బాలికలు చుట్టునుచేరి భజనలు చేయుచుండిరి. ఈ ప్రార్థన భజనలలో, గీతాపారాయణలో రామం ఆత్మగూడ పాల్గొనెనని నా నమ్మకము, ఆశ్రమ వాసులందరు కూడ అట్లేతలచిరి.

ఈ విచారమైన వార్తను వినగానే, రామం తనయులు, కామరాజు, ఆత్మారాం, వారి బంధుమిత్రులతో రాజమండ్రి, పిఠాపురముల నుండి ప్రార్థన, భజనలతో సాయంకాలము. దహనసంస్కారముల గావించిరి.

ఇంత అదృష్టమైన మృత్యువును, ఈ విధమైన, ప్రార్థన భజనలు జూచి, మా నిర్వాణానంద స్వాములువారు, తన శరీరమునుగూడ ఆశ్రమంలోనే వదలిపెట్టి ఇట్టి భజనలు, వేద, గీతాపారాయణలతో గడుపుటకు కోరుచుంటినని, నాకు ఆనాడు ఒక వుత్తరమును వ్రాసెను. ఆశ్రమ జీవితమేగాక ఆశ్రమంలో శరీరమును వదులుట, అట్టి సునాయసమైన మృత్యువు లభించుటగూడ అదృష్టమేయనియు శ్రీస్వామి నిర్వాణానంద వ్రాసిన వాక్యములు మా శాంతి పాఠకులతో పంచుకొనుటకు ఈక్రింద వ్రాయుచుంటిని.

"శ్రీ కక్కిరాల రామారావుగారు మరణించుటకుముందు, తొలి రోజునే, వారు వైద్యము నిమిత్తం వెళ్లుటకు నిశ్చయించి ప్రయాణోన్ముఖులై యుండియు, అకస్మాత్తుగ ప్రయాణం నిలచిపోయినది, అని, అంటే ఆ మరునాడే వారికి సుఖమరణం సంప్రాప్తమై యుండుటచేతను పుణ్యభూమియైన శ్రీశాంతి ఆశ్రమంలో మరణించుట వారికి విధి నిర్ణయ మగుటచేతను, వారి ప్రయాణం ఆగిపోయినదని, ఆశ్రమవాసులతో నేను చెప్పితిని.

పూజ్య శ్రీస్వామీజీ అమృత హస్తముల మీదుగా అసువులు బాసి, కైవల్య పదవి పొందిరని చెప్పుకొనుట కెంతమాత్రము సందేహములేదని చెప్పితిని-శ్రీ స్వామీజీ స్వయంగా శవమువద్దకువచ్చి శవమునెత్తిమీదను, దాని ప్రక్కనే కూర్చుని దుఃఖించుచున్న, వారిభార్య శిరస్సుపై నిన్ని, స్వామీజీ తమ అమృత హస్తము కొంత సేపుంచి, వారిని ఆశీర్వదించిన దివ్యదృశ్యము నేను నేత్రానందముగా చూచి-వారు ఉభయములకు ముక్తితప్పదని ఆనందముతో నిశ్చయించుకొంటిని.

వారు రాజమండ్రి వెళ్లియుంటే–అక్కడనే మరణించి యుండెడివారు–ఒకవేళ శవమును, కారుమీద ఆశ్రమంనకు రప్పించి, యిక్కడనే ఖననం చేయించినను, అదివట్టి నిష్ప్రయోజనము–ఏమంటే కాశీలో చనిపోతే, పుణ్యమని చెప్పినప్పుడు, అక్షరాల ఆ పని జరుగవలెనేగాని, అన్యప్రదేశములలో మరణించిన వారి శవములను, కాశీకి మోసుకుపోయి అక్కడ దహన పరచిన ప్రయోజన మేమికలదు?అట్టి కోరిక కలవారు కాశీలోనే చనిపోవలెను.

ఒకప్పుడు పిఠాపురం రాజాగారు (ఈమధ్య చనిపోయిన మహారాజా వారి తండ్రిగారు) శ్రీ గంగాధరరామారావుగారు దైవభక్తులు–వృద్ధులు అగుటచే, కాశీలో మరణించినట్లైన తమకు పునర్జన్మ ఉండదనియు, అది అంతటి పుణ్యక్షేత్రమని వినియుండి–కాశీలో మకాముపెట్టి చాలకాల మచ్చట నివసించిరి. గాని వారికి అక్కడ మరణము సంప్రాప్తము కాలేదు. వారు గొప్ప ఎస్టేటునకు రాజాఅగుటచేత శ్రీవారు అనేక ప్రాపంచికపు కార్యకలాపములలో మునింగి యుండుటచేతను,ఏవో కొన్ని పరిస్థితులు సరిజేయుటకు కాశీనుండి పిఠాపురం రప్పించబడి, కొలది రోజులలో పిఠాపురంలోనే మరణించిరి.

కేవలం మరణము కొరకే కాశీలో మకాంపెట్టిరని ప్రజలందరకు తెలిసిపోవుటచేత అయ్యో! అయ్యో! దురదృష్టవంతులుగదా! పుణ్యభూమిలో చనిపోలేకపోయిరిగదా! విధి నిర్ణయం, యెవరును తప్పించలేరుగదా అని జాలిపడి జనులందరు చెప్పుకొనుచుండగా, నేనుకూడ విని విచారించితిని.”

దేవుని ఆజ్ఞలేనిదే,చీమయైనను కుట్టజాలదని, శ్రీ స్వామీజీ చెప్పెడి మాట ముమ్మాటికి తథ్యం.

కీర్తి శేషులైన శ్రీ కక్కిరాల రామారావుగారి ఆత్మకు శాంతి కలుగుగాక!

ఓం, శ్రీ నిర్వాణానంద.

శ్రీరామం జీవించియే యుండెను. ఎప్పటికి జీవించియే యుండును, స్వార్థ రహితులు, యెన్నటికి చనిపోరని స్వార్థులు జీవించియున్నను,చనిపోయినవారే యనియు తరుచు చెప్పుచుందును. గాన, మా రామం ధన్యజీవి. విదేహముక్తులు. చనిపోయినను శాశ్వతముగా జీవించియే యుండును.

ఆశ్రమ జీవితము సముద్రములో యున్న మత్స్యముల జీవితము వంటిదనియు, ఆశ్రమం బైటకు వెళ్ళిన, పొడినేలమీద వుంచబడిన చేపలవలె, గిలగిల కొట్టుకొనుచు, పరిమితి లేనన్ని తాపత్రయములు, అవస్థలు, బాధలచే నిండియున్న



ప్రకృతి జీవితములు ప్రత్యక్షముగా జూచుచుంటినని, సదా చెప్పుచుందును. అంతా రామమయం బీజగజమంతా రామమయం! శ్రీరామం ఆశ్రమంలో ఎప్పుడూ జీవించియే యుండును. జీవించి యుండగా రామం నిరంతరము ఆశ్రమ వృద్ధియే తన వృద్ధిఅని పరితపించెడివారు, ఇప్పుడు గూడ ఆయన ఆత్మ ఆశ్రమ వృద్ధినే కోరుచుండెనని నా నమ్మకము.

మా రామీలుగూడ, మారామం హఠాత్తుగా చనిపోవుటకు విచారించుచున్నవా యన్నట్లు ఆనాడు భజనలు, దహన సంస్కారములలో పాల్గొనెను.

శ్రీరత్నమ్మగారిని, ఆశ్రమ వాసులందరు తల్లిగారని పిలుచుచుందురు. శ్రీరామం ఆమెను విచార సముద్రములో విడచి హఠాత్తుగా వెళ్ళిపోయినను, ఆమె భక్తి ప్రేమలతోధైర్యముగా నుండి,రామం ఆత్మశాంతికి ప్రార్థన ధ్యానాదులు సలుపుచునే యుండిరి, కృపామయుండైన దైవము–రామునికి సీతవలె, రాత్రింబగళ్ళు సేవచేసిన సహధర్మచారిణి అనెడి పేరును,కీర్తిని, పొందిన శ్రీరామం ధర్మపత్ని, శ్రీ తల్లిగారిని, వారి తనయులను, బంధుమిత్రులందరినీ, ఆత్మశాంతితో ఆయురారోగ్యములతో బ్రోచుగాక!

శ్రీరామం ఆత్మశాంతిని కోరుచు సమారాధన దినమున యీ ఆశ్రమంలో, వాల్తేరు ఆశ్రమంలో గూడ ప్రార్థనలు, వగైరాలు జరుపబడెను. ఆయన అశరీరి అయినను నిరంతర ఆత్మ జ్ఞప్తితో సదా ఆశ్రమ వృద్ధిని కోరుచున్న ధన్యజీవిగా యుండును.

ఆశ్రమాభిమానులందరూ, మా శాంతి పాఠకులు, శ్రీరామం ఆత్మశాంతిని, ఆశ్రమ వృద్ధిని కోరుచు వారి ప్రార్థనలను పంపుచు లోకశాంతికి తోడ్పడెదరుగాక!

ఓం సర్వేషాం శాంతిర్భవతు

ఓం సర్వేషాం స్వస్తిర్భవతు

ఓం సర్వేషాం పూర్ణంభవతు

మన రామం ఆత్మశాంతిని కోరుచు, ఈ వ్యాసమును శాంతి గీతముతో పూర్తి చేయుదుము గాక !

ఓం ఓం ఓం

(శాంతి ఏప్రిల్ 1969)

## మాతృశ్రీ శేషమ్మగారు

–జ్ఞానేశ్వరిమాతాజీ

శ్రీ శాంతి ఆశ్రమభక్తులు, అభిమానులు, శ్రేయోభిలాషులు శ్రీశేషమ్మగారి గురించి తెలియనివారుండరు. వారందరి హృదయములలో మాతృశ్రీ శేషమ్మగారి భక్తి సేవలు మెదలుచునేయుండును.

ఆమె జీవితము శాంతి ఆశ్రమమునకు, శ్రీస్వామీజీ సేవకు అంకితముచేసి 45 సంవత్సరములుపైగా అహర్నిశములు విసుగు విరామమనునదిలేకుండా, సేవచేసి అందరి మన్ననలను పొందిన పుణ్యజీవి. తనసౌఖ్యమనునది తెలియకుండా సదా ఇతరుల సేవలో ముఖ్యముగా అన్నపూర్ణ క్షేత్రము (వంటశాల)లో రాత్రింబగళ్ళు ఓర్పు సహనములతో గడిపి సేవచేసిన మాతృమూర్తి.

పూజ్యస్వామీజీ పల్కినదే వేదవాక్కని గ్రహించి వారు చెప్పినరీతిగా వారి పవిత్ర అడుగుజాడలలో నడచిన జ్ఞానశీలి. శారీరకముగా,మానసికముగా తన సర్వస్వము ఆశ్రమసేవకు అర్పించి పాటుపడిన నిస్వార్థజీవి.

పూజ్యస్వామీజీ పెదవులపై సదా శేషమ్మ, శేషమ్మ అని స్మరింపబడిన భాగ్యము గల్గిన అదృష్టశాలి. ఈ మాతృశ్రీకి ఫిబ్రవరి 10వ తేదీన అస్వస్థతకల్గినది. జీవించి యుండగా తనకై ఎవరూ శ్రమ, బాధ పడవలదని అహర్నిశలు తలచెడివారు, అదేరీతిగా తన అనారోగ్యములో కూడా ఎవ్వరికి శ్రమయివ్వకూడదన్న ఆమె దృఢ సంకల్పముతోనే, ఆమె అతి స్వల్పకాలములోనే మనలనందరినీ విడచి ది 28–2–86వ తేదీన తన భౌతిక కాయమునువీడి ఓంకారగురుదేవుల దివ్య సాన్నిధ్యములో లీనమయిరి. ఆమె ఆశ్రమమునకు, శ్రీ స్వామీజీ వారికేగాక తన పూర్వాశ్రమ నివాస స్థానమైన పిఠాపుర భక్తులకుకూడ ఘనమైన ఖ్యాతికలిగించెడి సేవచేసి తన జీవితమును ధన్యత చేసుకొనిన త్యాగశీలి.

జనవరి 21–86వ తేదీన జరిగిన పూజ్యశ్రీ స్వామీజీవారి 92వ జయంతిని ఆనందముగా తిలకించి అన్నికార్యక్రమములలో పాల్గొనుచూ, ఆశ్రమమునకు వచ్చిన భక్తులందరకూ ఎనలేని సేవచేసి ఆ చివరిరోజులు మరపురానీయకుండ చేసిన సేవామూర్తి.

మాతృశ్రీ శేషమ్మగారి ఆత్మశాంతిని కోరుచూ మా శాంతి పాఠకులు, ప్రార్థనలు సల్పెదరుగాకయని కోరుచూ ఆమెకు భక్తిపూర్వక శ్రద్ధాంజలర్పించుచుంటిమి.

ఓం ఓం ఓం

(శాంతి మార్చి 1986)



## శ్రద్ధాంజలి

### ప్రియమైన శ్రీ పరమహంస యోగానంద (యు.ఎస్.ఎ) గారి స్మృత్యర్థం.

**అనువాదం : డా. కె.వి. రామారావు**

ధగధగ మెరిసే 'తూర్పు' నక్షత్రాల్లో ఒకటి పశ్చిమాన అస్తమించింది. తన పావనజీవన చివరి ఘడియల వరకు తేజస్సును విరజిమ్ముతూ! ప్రకాశవంతమైన ఆ నక్షత్రం పరమహంస యోగానందజీ సెల్ఫ్‌రియలైజేషన్ ఫెలోషిప్ మరియు దాని సర్వమత చర్చిశాఖలు, మరియు యోగదా సత్సంగ సొసైటీ ఆఫ్ ఇండియా యొక్క వ్యవస్థాపకులు. ఆయన ప్రఖ్యాత ఉపన్యాసకులు మరియు ఆటో బయోగ్రఫీ ఆఫ్ ఎ యోగితో సహా అనేక ఆధ్యాత్మిక గ్రంధాల రచయిత.

ప్రతిరాత్రి నక్షత్రాలు వచ్చినట్లు తూర్పు తెల్లవారగానే అవి మాయమయినట్లు భౌతిక నేత్రానికి కనిపిస్తుంది; కాని ఆధ్యాత్మిక నేత్రంతో చూస్తే అవిరానూ రావు, పోనూపోవు. నిరంతరం ప్రకాశిస్తూ అవి అక్కడే ఉన్నాయి. మనిషి జీవితం కూడా అంతే. నిజమయిన జీవితం, శాశ్వతమైన జీవితం కూడా అంతే. దానికి రాకపోక లుండవు. శాశ్వతంగా మెరుస్తూ అలాగే ఉంటుంది; పగలు, రాత్రి, పుట్టుక,చావు లాంటి వాటికి అది అతీతమైనది.మరణం గురించి విశ్వకవి రవీంద్రనాథటాగూరు ఒకమాట అన్నాడు. అది కాంతిని అంతం చెయ్యడంకాదు, ఉషోదయం అయింది కనక దీపాన్ని ఆర్పెయ్యడం లాంటిది అని. యోగానంద స్వామివారు ఉన్నత తర లోకాలకి ప్రస్థానం కోసం ఈ ప్రపంచాన్ని విడిచిపెట్టాలి ఎందుకంటే వారికి ఉషో దయం అయింది. ఈ భూతలం మీద నివసించినంత కాలం నిరంతర క్రియాశీలతతో అద్భుతమైన కృషిచేశారు. ఇక్కడ,అక్కడ, అన్నిచోట్లా తూర్పున, పడమరన సర్వత్రా తమ శాస్త్రీయ యోగదా (ధ్యాన) పద్ధతిని ప్రచారం చేశారు.

కేవలం మానవజాతి మంచికోసం ఆయన ప్రాక్పశ్చిమ దేశాల్లో చేసినదంతా వివరించడానికి పెద్ద గ్రంథం రాయవలసి ఉంటుంది. అందుచేత నేను ఆయనతో నాకున్న వ్యక్తిగత పరిచయం, సాన్నిహిత్యం గురించి వ్రాయడానికి మాత్రమే పరిమిత మవుతాను. మానవ హితంకోసం ఆ మహాత్ముడు చేసిన వాటి గురించి వారి పుస్త కాల్లో చదవచ్చు, వారి ప్రసంగాల్లో వినవచ్చు. అమెరికా నించి వారు నాకు రాసిన కడపటి ఉత్తరంలో ప్రపంచవ్యాప్తంగా వారికి 85 కేంద్రాలు ఉన్నాయని, వారి ఆటో బయోగ్రఫీ ఆఫ్ ఎ యోగి గ్రంథం 12 ఇతర భాషల్లోకి అనువదించబడినదని వ్రాశారు. 2018వ సంవత్సరం నాటికి భారతదేశంలో 200 కేంద్రాలు; ఇతర దేశాల్లో వందలాది కేంద్రాలు ఉన్నాయి. 'ఆత్మకథ' గ్రంథం 50 భాషల్లో

అందుబాటులో వుంది. ప్రచురణకర్త గమనిక. మొత్తం ప్రపంచాన్ని జయించే నిర్విరామ ప్రయత్నంలో అమెరికాలో అర్ధభాగం ఆయన (యోగానందగారు) జయించారు. ప్రపంచం మూల మూలలకి తన సందే శాన్ని వ్యాప్తిచెయ్యాలనే ఆయన ఉద్ధృతమైన శక్తి,పట్టుదల అటువంటిది. మన 'శాంతి' ఆశ్రమ భక్తురాలు ఒకామె కాలిఫోర్నియా నించి లేఖరాస్తూ ఒకపెద్ద సమావేశంలో మన భారతదేశపు రాయబారి గార్ని పరిచయంచేస్తూ చేస్తూ శ్రీ పరమహంస యోగా నందగారు వెనుకకుపడిపోయారని, దానివల్ల హార్ట్ ఫెయిల్యూర్ అయిందని వ్రాసింది. పరమహంస యోగానందజీ ఇక లేరంటేనూ, మరల వారి ప్రభావవంతమైన రూపాన్ని మన భౌతిక నేత్రాలతో చూడలేమంటేనూ నమ్మశక్యం కావటంలేదు.

మనకు అనంతమైన విజ్ఞానం జ్ఞానం ఉన్నప్పటికీ భగవంతుని వైభవం ముందు మనం ఎంత అల్పులమోకదా ! ఈ భూమ్మీద జీవితం ఎంత దుర్బలమో ఎంత అనిశ్చితమోకదా! లోకాతీతుని పిలుపు ఎవరికి, ఎప్పుడు, ఎలా వస్తుందో ఎవరికీ తెలియదుకదా! ఇవ్వాళ వస్తుందా, రేపా; గుండె ఆగిపోయివస్తుందా,మరో జబ్బు లానా ఎలావచ్చినా ఎప్పుడు వచ్చినా హఠాత్తుగా వచ్చినా సిద్ధంగా ఉన్నవాడే ధన్యుడు. నాకోసంగాని, ఇతరుల కోసంగాని నాకేదైనా కోరిక ఉందంటే, అది ఏమిటంటే ఆ 'పిలుపు' వస్తే సుదూర భవిష్యత్తులోకాని, ఇప్పుడుకాని సంసిద్ధంగా ఉండాలి.దీర్ఘ కాలం జీవించాలనేకోర్కె అణుమాత్రం లేదు,కాని ఈ క్షణంలో పిలుపువస్తే సిద్ధంగా ఉండాలనే కోర్కె మాత్రమే వుంది.

స్వామి యోగానందగారితో నా వ్యక్తిగత పరిచయంగురించి ప్రస్తావించాను కదా. సుమారు 20 సంవత్సరాల క్రితం అమెరికాలోని అట్లాంటిక్ సిటిలో సముద్ర తీరాన నేను కొన్నివేసవి దినాలు గడిపినప్పుడు స్వామీజీ నన్నుచూడ్డానికి నాతో కొంత సమయం గడపడానికి అక్కడకువచ్చారు. అక్కడ గదిలో ఒకే మంచం వుండడంవల్ల ఇద్దరం అందులోనే పడుకోవల్సి వచ్చింది. తెల్లారాక, ఆయన చిరు నవ్వుతో నన్నడిగారు. "స్వామీజీ, నిద్రలో నేను గురకపెట్టానా? మీ నిద్రపాడు చెయ్యలేదుకదా?" నేనిలా జవాబిచ్చాను" డియర్ స్వామిజీ, అది గురకలాలేదే, అలాంటి శ్వాసించడాన్ని నేనింతవరకు ఎక్కడా వినలేదు. ఏదో పెద్ద ఇంజను పంపు చేస్తున్న శబ్దంలా వుంది.ఏదో యోగవ్యాయామం చేస్తున్నారనుకున్నాను. రాత్రంతా అలా చూస్తూండిపోయాను." నా మాటలు విని ఆయన తన సహజమైన ప్రేమ స్వభావంతో ఫెళ్ళుమని నవ్వారు. ఆ తర్వాత ఆయన కొన్ని భారతీయ వంటకాలు, కూరలు వండారు.దైవ నామస్మరణతో మేం ఇద్దరం భోజనం చేశాము.



తరువాత నేను భారతదేశంలో ఉన్నప్పుడు, ఆయన అమెరికా నించి వచ్చారు. నేను కాలుకి సిమెంటు కట్టుతో హాస్పటలులో ఉన్నానని తెలిసి నన్ను, (నాతో ఉన్న సుశీలాదేవిని), చూడ్డానికి దయతో వచ్చారు. సందర్భం ఏదైనా ఆయన ఎప్పుడూ ఒక ప్రేమతో కూడిన మాట, ఒక హాస్యోక్తి, సందర్భోచితమైన ఒకమంచి సలహా తప్పక ఇచ్చేవారు. అలాగే తమ యోగ విద్యార్థులకి, స్నేహితులకి ప్రసంగం వినే శ్రోతలకు ఏదో ఒక కథ తప్పక చెప్పేవారు. పెద్ద పెద్ద సమావేశాల్లోనైనా, మిత్రులతో కలసి భోజనం చేసేటప్పుడైనా ఇది వారి స్వభావసిద్ధమైన ప్రవర్తన.

'దమిషన్ ఆఫ్ పీస్' శ్రీ శాంతి ఆశ్రమం సభ్యులందరి తరపున శ్రీ పరమహంస యోగానందగారి శాశ్వత ఆత్మ, శాశ్వత కాంతిలో శాశ్వత విశ్రాంతి పొందాలని మనందరి ప్రార్థనలను అందచేస్తున్నాను. తూర్పు పడమరల్లో విస్తరించి ఉన్నవారి శిష్యులకు, యోగ విద్యార్థులకు, భక్తులకు, అనుచరులకు ఈ కష్ట సమయంలో మన ప్రగాఢమయిన సానుభూతిని తెలియచేస్తున్నాను.

(పీస్ మార్చి & ఏప్రిల్ 1952)